# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్   బుధవారం 8-2-2023   RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   సంపుటి :29   సంచిక: 140   పేజీలు:6   వెల: రూ.1/-


## తెలంగాణలో బీసీల అభ్యున్నతికి ప్రభుత్వ ప్రాధాన్యం : మంత్రి తలసాని

రంగారెడ్డి, ఫిబ్రవరి 7: ప్రజల గురించి అనునిత్యం ఆలోచించే బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును గమనించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో బీసీల ఆత్మగౌరవ భవనాలకు మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు.

పిల్లల చదువుల కోసం గురుకులాలు, ఆడబిడ్డల పెండ్లిండ్ల కోసం కల్యాణలక్ష్మి, కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు తదితర సౌకర్యాలన్నింటిని సీఎం కేసీఆర్ కల్పిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో భగవంతుడి పేరు మీద రాజకీయాలు నడిపించే వారిని నమ్మవద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24గంటల కరెంట్ తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇంటింటికి తాగునీరు అందిస్తుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు కనెక్టవిటి ని కల్పించారని తెలిపారు. విద్యాభివృద్ధికి పాఠశాలలు, కళాశాలలు పెద్ద ఎత్తున నిర్మించుకున్నామని అన్నారు.

## వేములవాడ ఆలయ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ సమీక్ష

రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : వేములవాడ ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు, సంబంధిత అధికారులతో కలిసి మంత్రి కేటీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వేములవాడ ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. మహా శివరాత్రికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. వేములవాడ జాతరకు సౌకర్యాలు కల్పించేందుకు అదనపు నిధులు కేటాయిస్తాం. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలి. రాష్ట్ర సాంస్కృతిక శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు కేటీఆర్ సూచించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలను అభివృద్ధి చేసే ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను నిర్మించాలి. మూలవాగుకు అనుకుని ఉన్న బండ్‌ను సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌గా మారుస్తామన్నారు. నృత్య, సంగీత పాఠశాలలకు ప్రత్యేక భవనాలు నిర్మిస్తామన్నారు. వేములవాడలో త్వరలోనే మినీ స్టేడియం పనులు పూర్తవుతాయన్నారు. కొదురుపాక నుంచి వేములవాడ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తామన్నారు. నాంపల్లి గుట్టపై రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## జేఈఈ మెయిన్ 2023 తొలి విడుత పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ 2023 తొలి విడుత పరీక్షా ఫలితాలు మంగళవారం ఉదయం విడుదలయ్యాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీని ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) సోమవారం ఉదయం విడుదల చేసిన సంగతి తెలిసిందే. జేఈఈ మెయిన్ ఫలితాల కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు. ఫలితాల కోసం అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ తప్పనిసరి. గత నెల జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జేఈఈ మెయిన్ 2023 తొలి విడుత పరీక్షలను నిర్వహించిన విషయం విదితమే. ఈ పరీక్షలకు దాదాపు ఎనిమిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. మరో వైపు జేఈఈ మెయిన్ రెండో విడుత పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానుంది. తొలి విడుత పరీక్ష రాసిన విద్యార్థులు కూడా రెండో విడతకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

## అదానీ ఆస్తులపై రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అదానీ ఆస్తులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇవాళ పార్లమెంట్‌లో ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం అదానీ సుమారు 10 రంగాల్లో వ్యాపారం చేస్తున్నారని, మరి 2104 నుంచి 2022 వరకు ఆయన ఆస్తులు 8 బిలియన్ల డాలర్ల నుంచి 140 బిలియన్ల డాలర్లకు ఎలా వెళ్లాయని యువత అడుగుతున్నారని ప్రశ్నించారు. భారత్ జోడో యాత్ర సమయంలో వివిధ రాష్ట్రాల ప్రజలు ఈ ప్రశ్నలు వేసినట్లు ఆయన తెలిపారు. తమిళనాడు, కేరళ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకు అంతటా ఒక్కటే పేరు వినిపిస్తోందని, అంతటా అదానీ పేరే వినిపిస్తోందని రాహుల్ అన్నారు. అదానీ ఏ వ్యాపారంలో అడుగుపెట్టినా అతను ఫెయిల్ కారని ప్రజలు అంటున్నట్లు రాహుల్ గుర్తు చేశారు. కశ్మీర్‌లోని యాపిళ్ల నుంచి.. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్డుల గురించి కూడా అదానీ పేరు వినిపిస్తోందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం లాంటి అంశాలను ప్రస్తావించలేదన్నారు. అగ్నివీర్ పథకం ఆర్మీ ఆలోచన నుంచి రాలేదని, అది ఎన్ఎస్ఏ చీఫ్ అజిత్ దోవల్ ఆలోచన నుంచి వచ్చిట్లు రాహుల్ విమర్శించారు. అగ్నివీర్ పథకాన్ని బలవంతంగా ఆర్మీపై రుద్దినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఆయుధ శిక్షణ ఇచ్చి, వాళ్లను తిరిగి సమాజంలోకి పంపడం వల్ల హింస పెరుగుతుందని రిటైర్డ్ ఆఫీసర్లు ఆరోపిస్తున్నట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు.

## రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ ఎస్పీగా ఆర్ వెంకటేశ్వర్లు, సైబరాబాద్ పరిపాలన డీసీపీగా యోగేశ్ గౌతమ్, పీసీఎస్ ఎస్పీగా రంగారెడ్డి, జీఆర్పీ అడ్మిన్ డీసీపీగా రాఘవేందర్‌రెడ్డి, వరంగల్ పోలీస్ శిక్షణా కేంద్రం ఎస్పీగా పూజ, డీజీపీ కార్యాలయం న్యాయవిభాగం ఎస్పీగా సతీశ్, వరంగల్ నేర విభాగం డీసీపీగా మురళీధర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత జనవరిలోనూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 25న రాష్ట్రవ్యాప్తంగా 91 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.

### చరిత్రలో నేటినిజం



కం॥ దాచిన ముత్యమ్ము పగిది
పూచిన కుసుమమ్ము వోలె పున్నెపు కరణిన్
వేచిన వాదయము మాదిరి
రోచిష్మయుడైన "అజహారుద్దీన్" వెలుగున్!!

( ఫిబ్రవరి 8 అజహారుద్దీన్ పుట్టిన రోజు...)



-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## నలుదిశలా హైదరాబాద్ నగర అభివృద్ధి : కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 7:పాతబస్తీ అభివృద్ధిపై పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నగర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తొలి నుంచి పాటుపడుతుందని, ఇప్పటికే హైదరాబాద్ నగరం నలుదిశలా విస్తరిస్తూ అద్భుతమైన ప్రగతితో ముందుకువెళ్తున్నదన్నారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కూమార్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్ శాఖతో పాటు జిల్లా కలెక్టర్, వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పాతబస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను అధికారులు సమావేశంలో అందజేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన ఎస్ఆర్‌డీపీ కార్యక్రమంలో భాగంగా పాతబస్తీలోనూ భారీగా రోడ్డు నెట్వర్క్ బలోపేతానికి సంబంధించిన కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, ఇందులో ఇప్పటికీ పలు ఫ్లై-ఓవర్లు, రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమం కింద దాదాపు వందల కోట్లతో నిధులతో అనేక పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ చేపట్టిన సీఆర్ఎంపీ కార్యక్రమం ద్వారా ప్రధాన రోడ్ల నిర్వహణ సైతం ప్రభావవంతంగా సాగుతుందన్నారు. జనావాసాలు అధికంగా ఉన్న పాతబస్తీలాంటి ప్రాంతాల్లో రోడ్డు వైడనింగ్ కార్యక్రమం కొంత సవాల్‌తో కూడుకున్నదని, అయితే రోడ్డు వైడనింగ్ తప్పనిసరి అయినా ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను అదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన మరిన్ని భూసేకరణ నిధులనుఅందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**బృహత్ సంకల్పంతో ముందుకు..**

ట్రాఫిక్ జంక్షన్లతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, అవసరమైన చోట మూసీపై బ్రిడ్జిల నిర్మాణాన్ని వేగంగా కొనసాగిన్నస్తున్నట్లు పేర్కొన్నారు. చార్మినార్ పెడెస్ట్రియన్ ప్రాజెక్టు పనులు సైతం దాదాపుగా పూర్తి కావచ్చాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ నరివడా తాగునీరు అందించాలన్న బృహత్ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకుపోతున్నదని, అందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని తాగునీటి సరఫరా సంతృప్తికర స్థాయిలో ఉందని కేటీఆర్ తెలిపారు. గత ఎనిమిదేళ్లలో పాతబస్తీ పరిధిలోను తాగునీరు సరఫరా మెరుగుపడిందన్నారు. ఇందుకోసం వివిధ తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి సుమారు రూ.1200 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉచిత తాగునీటి సరఫరా పథకంలో భాగంగా పాతబస్తీలో రెండున్నర లక్షలకుపైగా నల్లా కనెక్షన్ల ద్వారా ఉచిత తాగునీరు అందుతుందని కేటీఆర్ తెలిపారు. జలమండలి ద్వారా మురికి నీటి వ్యవస్థ బలోపేతానికి అనేక కార్యక్రమాలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం పాతబస్తీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీవర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు ఇతర కార్యక్రమాలను జలమండలి చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌తో పాటు పాతబస్తీలోను విద్యుత్ సరఫరా వ్యవస్థ అద్భుతంగా మెరుగైందని తెలిపారు.

**పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం ప్రత్యేక దృష్టి**

పారిశుధ్య నిర్వహణ విషయంలోనూ జీహెచ్ఎంసి తీసుకున్న ప్రత్యేక చర్యలతో పాతబస్తీలో పరిస్థితి మార్పువచ్చిందన్నారు. ముఖ్యంగా చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, మదీనా, మక్కా మసీద్, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య రంగంలోనూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల ప్రభుత్వ పథకాల అమలుతో పాటు, ప్రత్యేకంగా 84 బస్తీ దవాఖానాలను ఇప్పటిదాకా పాతబస్తీలో ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మీర్ ఆలం మండి మార్కెట్ రిస్టోరేషన్ కోసం పురపాలక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళికలు సిద్ధంగా చేసినట్లు తెలిపారు. మీర్ ఆలం ట్యాంక్ పైనుంచి ఆరు లైన్ల కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం డీపీఆర్ దశలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉన్న అనేక వారసత్వ కట్టడాలు, వారసత్వ సంపద ప్రధానంగా పాతబస్తీలో ఉన్న నేపథ్యంలో, వాటిని రక్షించడంతోపాటు పునరుజ్జీవన కార్యక్రమాలను సైతం పెద్ద ఎత్తున చేపట్టిన అంశాన్ని కేటీఆర్ సమావేశంలో ప్రస్తావించారు.

**సంతోషం వ్యక్తం చేసిన అక్బరుద్దీన్**

హైదరాబాద్ అభివృద్ధిలో పాతబస్తీ ప్రగతికి ప్రాధాన్యం ఇవ్వడంపై సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుదుద్దీన్ ఒవైసీ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి, ప్రధానంగా మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అదనంగా పాతబస్తీలో చేపట్టాల్సిన పలు కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, క్షేత్రస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ శాఖలతో కలిసి పని చేస్తామని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



– పూర్వపు జిల్లాను పరిగణనలోకి తీసుకోవాలని బదిలీలు

హైదరాబాద్ ఫిబ్రవరి 7మ్ (ఎక్స్ ప్రెస్ న్యూ స్).: ఉపాధ్యాయుల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి పూర్వపు జిల్లాను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉత్తర్వులు 317లో వేరే జిల్లాకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూర్వ జిల్లా సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి సీఎం కేసీఆర్ సూచనల మేరకు అవకాశం ఇవ్వనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో మంగళవారం తన కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ప్రారంభమైన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందని జీవో 317 కింద బదిలీ అయిన ఉపాధ్యాయులు తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12 ఉంచి 14వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులందరికీ సమన్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే వచ్చిన 59 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయబడుతందని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు

## రూ. 90 వేల వరకు ఉన్న రుణాలు మాఫీ : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలోని రైతులకు మంత్రి హరీశ్‌రావు శుభవార్త వినిపించారు. 2023–34 బడ్జెట్‌లో రైతుల రుణమాఫీ కోసం రూ. 6,385 కోట్లు కేటాయించామన్నారు. రూ. 90 వేల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన అనంతరం సోషియో ఎకానమిక్ సర్వే విడుదల సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని వెల్లడించారు.

రైతు బంధు పథకానికి కూడా రూ. 275 కోట్లు పెరిగాయన్నారు. రైతు బీమా పథకానికి రూ. 123 కోట్లు పెంచామన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్, మెస్ నిధులను రూ. 4,690 కోట్ల నుంచి రూ. 5,609 కోట్లకు పెంచామని తెలిపారు. మొత్తంగా రూ. 919 కోట్లు పెరిగిందన్నారు. 33 జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేయబోతున్నాం.. ఇందు కోసం బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు ఈబడ్జెట్‌లో రూ. 460 కోట్లు అధికంగా కేటాయించామన్నారు. గతంలో రూ. 2,750 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో రూ. 3,210 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు.

రహదారుల నిర్వహణ కోసం బడ్జెట్‌లో అతి ఎక్కువగా నిధులు కేటాయించుకున్నాం. ఇందుకు రూ. 2500 కోట్లు కేటాయించాం. పంచాయతీరాజ్ శాఖలో కూడా రోడ్ల నిర్వహణ, మరమ్మతుల కోసం రూ. 2 వేల కోట్లు కేటాయించాం. మెరుగైన రోడ్లను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పలు యూనివర్సిటీలలో హాస్టల్స్ సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. నూతన హాస్టళ్ల నిర్మాణానికి, ఆధునీకరణకు ఈ బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 80 వేల ఉద్యోగాల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది అని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఆరోగ్య శాఖలో 950 మందిని రిక్రూట్ చేశాం. పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీ చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో రూ. 1000 కోట్లు కొత్త ఉద్యోగుల కోసం బడ్జెట్‌లో కేటాయించాం. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను ఏప్రిల్ 1 నుంచి క్రమబద్ధీకరిస్తాం. సెర్ఫ్ ఉద్యోగుల పేస్కేల్‌ను ఏప్రిల్ 1 నుంచి సవరిస్తాం అని స్పష్టం చేశారు.

గృహ నిర్మాణ శాఖ ఆర్ అండ్ బీలో విలీనమైంది అని మంత్రి తెలిపారు. ఆర్ అండ్ బీలో హౌసింగ్ కోసం రూ. 12 వేల కోట్లు కేటాయించాం. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించాలనుకునే వారికి ఈ నిధులు కేటాయిస్తాం. రూ. 12 వేల కోట్లకు, డబుల్ బెడ్రూం ఇండ్లకు కేటాయించిన నిధులతో ఎలాంటి సంబంధం లేదు. సొంత జాగలో ఇండ్లు నిర్మించుకునేవారికి రూ. 3 లక్షల చొప్పున మంజూరు చేస్తాం అని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## తుర్కియోలో 100 సార్లు కంపించిన భూమి..



తుర్కియో ఫిబ్రవరి 7 ();తుర్కియో.. సిరియా ప్రాంతాల్లో సోమవారం నాడు మూడు తీవ్రమైన భూకంపాలు సంభవించాయి. తెల్లవారుజామున 7.8 తీవ్రతతో ఒకసారి రాగా మధ్యాహ్నం 1:24 గంటలకు 7.5 తీవ్రతతో మరోసారి భూకంపం వచ్చింది. సహాయ చర్యలు ముమ్మరంగా కొనసాగుతన్న సమయంలో సాయంత్రం 6 గంటలకు 6 తీవ్రతతో మూడోసారి భూకంపం వచ్చింది. కేవలం గంటల వ్యవధిలోనే మూడు భూకంపాలు సంభవించడంతో తుర్కియో.. సిరియాలలో భారీగా ప్రాణ.. ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటికే సుమారు 2300 లకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది క్షతగాత్రులు గా మారారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కన్పిస్తోంది. ఈ ఘటనపై ఆ దేశ అధ్యక్షుడు ఎర్డోగన్‌గ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గడిచిన 84 ఏళ్లలో తుర్కియోలో నమోదైన అతిపెద్ద భూకంపం ఇదేనంటూ వెల్లడించారు. అయితే నిన్నటి నుంచి తుర్కియేలో వందసార్లు భూ ప్రకంపకలు సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే విభాగం ప్రకటించింది. భారీ భూకంపం వచ్చిన తర్వాత చిన్న చిన్న ప్రకంపనలు కొనసాగుతాయని సైంటిస్టులు చెబుతున్నారు. నిన్న రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రతతో భూకంపం వచ్చిన తర్వాత నుంచి ప్రకంపనలు ఆగడం లేదు. ఇప్పటి వరకు రిక్టర్ స్కేలుపై 4 కంటే ఎక్కువ తీవ్రతతో 100 సార్లు భూమి కంపించినట్లు నివేదికలు చెబుతున్నాయి. భవిష్యత్తులోనూ 5.0.. 6.0 తీవ్రతతో కొంతకాలం భూ ప్రకంపనలు కొనసాగుతాయని ఈ విషయంలో సహాయ బృందాలు అప్రమత్తంగా ఉండాలని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. కాగా తుర్కియోలో భారీ భూకంపం కారణంగా మధ్యదరా సముద్రంలోని ఇసికందరన్ లోని లిమాక్ పోర్టు తీవ్రంగా దెబ్బతింది. కంటైనర్లు ఉంచిన ప్రాంతాల్లో భారీగా అగ్నికీలలు ఎగిసిపడుతున్నాయి. తుర్కియేలోని విద్యుత్ వ్యవస్థ.. సహజ వాయువు పైప్ లైన్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రభుత్వ రంగ పైపులైన్ ఆపరేటర్ బోటాస్ వెల్లడించింది.

గాజాయాంటెప్ హాటే.. కహ్రామన్మరాస్ ప్రావిన్స్ లకు పైప్ లైన్లో గ్యాస్ సరఫరా ఆగిపోయినట్లు పేర్కొంది. పైపు లైన్ కేంద్రం భూకంప కేంద్రానికి సమీపంలో ఉండటంతో తీవ్రంగా దెబ్బతిన్నట్లు వెల్లడించింది. విద్యుత్ వ్యవస్థ కూడా దెబ్బతినడంతో ఆస్పత్రులు.. ఆహార శాలలకు గ్యాస్ సరఫరా వ్యవస్థను పునరుద్ధరించేందుకు అత్యవసర చర్యలు చేపడుతోంది.

## పల్లెకు పట్టం కట్టిన బడ్జెట్ : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 7:తెలంగాణ బడ్జెట్ పల్లెకు పట్టం కట్టిందని, ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తూ ఏటేటా బడ్జెట్ నిధులను పెంచుకుంటూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ ఏడాది రూ.2,90,396కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఇందులో సింహభాగం రూ.32,426కోట్ల పంచాయతీ రాజ్‌శాఖకు కేటాయించినందుకు సీఎం కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆసరా పింఛన్లకు రూ.12వేలకోట్లు, మిషన్ భగీరథకు రూ.600కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అన్న మాటలను సీఎం కేసీఆర్ ఆచరణలో పెడుతున్నారన్నారు. పల్లె ప్రగతితో తెలంగాణ పల్లెలను ప్రగతి కేంద్రాలుగా తీర్చిదిద్దారని, ప్రస్తుతం తెలంగాణ పల్లెలు దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొంది తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశాయన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో 13 జాతీయ అవార్డులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. దెబ్బతిన్న పంచాయతీరాజ్ పాత రోడ్ల మరమ్మతులు, నిర్వహణ కోసం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు ప్రతిపాదించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## డ్రాగన్ దూకుడుకు దీటుగా బదులిస్తాం : ఆర్మీ కమాండర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: లడఖ్ సెక్టార్‌లో చైనా దుందుడుకు చర్యలకు పాల్పడితే దీటుగా స్పందించేందుకు సన్నద్ధంగా ఉన్నామని భారత సైన్యం స్పష్టం చేసింది. వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ) వెంబడి పెట్రోలింగ్‌తో పాటు పలు చర్యలు చేపడుతున్నామని దేశ సమగ్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఎల్ఏసీ వద్ద యథాతథ స్థితిని మార్చేందుకు చైనా దళాల దూకుడుకు భారత సైన్యం వేగంగా, దీటుగా స్పందించి అడ్డుకట్ట వేసిందని ఆర్మీ నార్తర్న్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఎల్ఏసీ వద్ద చైనా ఎలాంటి దుందుడుకు చర్యలకు తెగబడినా త్రివిధ దళాల మధ్య సమన్వయంతో మన సాయుధ బలగాలు డ్రాగన్ చర్యలను దీటుగా తిప్పికొడతాయని చెప్పారు. ఎల్ఏసీపై నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు దౌత్య స్థాయిలో, అధికారుల స్థాయిలో చేపట్టాల్సిన చర్యలూ కొనసాగుతున్నాయని తెలిపారు. ఎల్ఏసీలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సవాళ్లు, ముప్పును పసిగడుతూ ఎదుర్కొనేందుకు నార్తన్ కమాండ్ సంసిద్ధంగా ఉందని లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది తెలిపారు. జాతి ప్రజాస్వామిక పునాదులు, సంప్రదాయాలను కాపాడుతూ దేశ సార్వభౌమాధికారం, భౌగోళిక సమగ్రతను కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. తాము నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు అన్ని పరిణామాలను పసిగడుతూ జాతి ప్రయోజనాలు కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు.

# భూగర్భ ఫలకాల కదలికలే భూకంపాలకు కారణమా??

ప్రకృతి విపత్తులకు పేద, ధనిక వివక్ష లేదు. జీవుల ప్రాణులపై పక్షపాతం లేదు. గృహాలపై స్వార్థం లేదు. భూకంపాలు, వరదలు, సునామీల ప్రకోపానికి మనుషులు, జంతువులు, హరిత సంపదలు, ఆస్తుల విధ్వంసం సమానంగా ఉండవలసిందే. జాగ్రత్త పడడానికి సమయం ఇవ్వదు. భవనాలు ఊగిపోవడం, కాంక్రీట్ కుప్పల్లో ఆర్తనాదాలు, రోడ్లపై శీతల వాతావరణంలో జనం బిక్కు బిక్కున చేరడం, ఆకాశహర్మ్యాలు నేలమట్టం కావడం, గడియారపు స్తంభాలు నేల కూలడం లాంటి భీభత్సాలు క్షణాల్లో జరిగిపోతాయి. ఊహించని ఘోర ప్రకృతి విలయం విరుచుకు పడడం, భవనాలు నేలమట్టం కావడం, మూగజీవాలు మరణించడం, స్థిరచరాస్తులు ధ్వంసం కావడం అనాదిగా జరుగుతూనే ఉన్నాయి. డిజిటల్ యుగపు మనిషి దిక్కుతోచని దుస్థితిలో హాహాకారాలు చేయడం తప్ప చేయాల్సింది ఏమీ ఉండడం లేదు.

## క్షణాల్లో నగరాలు నేలమట్టం:

నిన్న అనగా 06 ఫిబ్రవరి ఉషోదయాన జరిగిన భయంకర భూకంప మృత్యుకేళితో ఆగ్నేయ తుర్కియే లేదా టర్కీ, సిరియా నగరాలు(అలెప్పో, హామా లాంటి) విలవిల్లాడడం, పేక మేడల్లా బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టం కావడం, శిథిలాల దిబ్బలుగా మారడం, వేల కొద్ది జనులు శిథిలాల కింద పడి తుది శ్వాస విడవడం చూస్తుండగానే జరిగి పోయింది. ప్రసార మాధ్యమాల్లో వీడియోలు చూసిన ప్రపంచ మానవాళి నివ్వెరపోయి విస్తుపోతున్నారు. కొద్ది గంటల్లోనే రిక్టర్ స్లేల్ పై 7.8, 7.6. 6.0 పరిమాణంతో మూడు సార్లు భూమి కంపించడంతో దక్షిణ-కేంద్ర టర్కీ ప్రాంతంలో గాజియన్టెక్ నగరంతో పాటు మరో 10 నగరాల్లో భవనాలు (రోడ్లు, నివాస భవనాలు, కార్లు, వాహనాలు, షాపింగ్ మాల్స్, విమానాశ్రయాలు) పూర్తిగా నేల మట్టం కావడం లేదా పాక్షికంగా ధ్వంసం కావడంతో 2 మిలియన్ల ప్రజలు నిరాశ్రయులయ్యారు. తొలి భూకంప విపత్తు తరువాత కనీసం 40 సార్లు భూమి కంపించడంతో టర్కీ, సిరియాలు గజగజ వణికి పోతూ, ప్రజలు హాహాకారాలు చేస్తూ రోడ్ల వెంట ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని నిస్సహాయంగా పరుగులు తీసారు. గత వందేళ్ళలో ఇంతటి భూకంపం రాలేదని, కనీసం 3,800 మంది చనిపోయి ఉంటారని తొలి వార్తలు వెలువడ్డాయి. కాని మరణాలు, క్షతగాత్రుల సంఖ్య అనేక రెట్లు ఎక్కువగా ఉండవచ్చని హృదయ విదారక దృశ్యాలు ధృవీకరిస్తున్నాయి. గాజియాన్టెక్ నగరానికి 33 కిమీ దూరంలో 18 కిమీ లోతులో భూకంప ప్రభావ కేంద్రం కనిపించడంతో గజియాన్టెక్ నగరంలోని 2,200 ఏళ్ళ క్రితం నాటి రొమన్ కాలపు చారిత్రక కట్టడం కూడా పూర్తిగా ధ్వంసం కావడం జరిగిపోయింది.

## భూగర్భ ఫలకాల కదలికతోనే పెను విపత్తులు:

భూకంపాలకు నెలవుగా మారిన టర్కీ ఒక్క 2000 సంవత్సరంలోనే 33,000 భూకంపాలు రికార్డు అయ్యాయని, ఇందులో రిక్టర్ స్కేల్ పై 4.0 పరిమాణంతో 332 సార్లు కంపించిందని వివరాలు తెలుపుతున్నాయి. టర్కీ దేశం భూకంపాల ముప్పు ఉన్న టెక్టోనిక్ ప్రదేశంగా గతంలోనే గుర్తించారు. భూమి అంతర్భాగంలో ఉన్న 15 ముఖ్య ఫలక పొరలను టెక్టోనిక్ ఫలకాలు(ప్లేట్స్)గా పిలుస్తారు. ఈ కదిలే స్వభావం కలిగిన ఫలక పొరల మధ్య రాపిడితో పగుళ్ళు, ఆకస్మిక కదలికలతో అపార శక్తి వెలువడడం వల్ల భూకంపాలు వస్తున్నట్లు ఆర్కియాలజీకల్ సర్వేలు వివరిస్తున్నది. యురాసియన్, ఆఫ్రికన్ ప్లేట్స్ మధ్య చీలిక ఏర్పడిన అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాల?(ప్లేట్స్) ఉన్న ప్రాంతంలో టర్కీ ఉన్నది. యురాసియన్, అనటోలియన్ టెక్టోనిక్ ఫలకాలు కలిసే ప్రదేశమైన 'నార్థ్ అనటోలియన్ ఫాల్ట్ లైన్' వద్ద భూకంప విధ్వంసం అధికంగా కనిపిస్తున్నది. ఇస్థాంబుల్ నుంచి టర్కీ వరకు గతంలో కూడా భయానక భూకంపాలు రికార్డు కావడం జరిగింది. పేదరికం రాజ్యమేలుతున్న టర్కీ, సిరియాల్లో అంతర్గత అశాంతి మంటలతో ప్రజలు అభద్రతల నడుమ బిక్కు బిక్కున బతుకులు ఈదుస్తున్నారు. సిరియాలో అంతర్గత యుద్ధం, టర్కీలో 30 లక్షలకు పైగా సిరియన్ శరణార్థుల చేరడం, భవనాలు బలహీనంగా నిర్మించడం, జనసాంద్రత ఎక్కువగా ఉండడం లాంటి సమస్యలు భూకంప నష్టాలను అనేక రెట్లు పెంచాయని నిపుణులు నిర్ధారించారు.

## భూకంపాలు కొత్తేమీ కాదు:

టర్కీ దేశంలో దాదాపు 90 శాతం అధిక భూకంప సంభావ్యత కలిగిన ప్రదేశంగా (ఇస్తాంబుల్, ఇజ్మిర్, ఈస్ట్ అనటోలియాలతో కలిపి) గుర్తించబడింది. 2013-22 మధ్య ప్రపంచవ్యాప్తంగా 30,673 సార్లు భూమి కంపించినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. 1999లో గోల్‌కుక్, డజ్సీ ప్రాంతాల్లో వచ్చిన భూకంపానికి (7.4, 7.0 స్కేల్) 18,000 మంది మరణించడం, 45,000 మంది గాయపడడం జరిగింది. డిసెంబర్ 1939లో ఎర్జిన్కాన్ నగరంలో 8.0 తీవ్రత కలిగిన భూకంపం రావడంతో 20,000 మంది చనిపోవడం, 1,16,720 భవనాలు ధ్వంసం కావడం తరువాత అంతటి తీవ్రత కలిగిన భూకంపంగా నిన్నటి విపత్తు గుర్తించబడింది. ఆగష్టు 1999లో ఇజ్మిత్ ప్రాంతంలో అన్టోలియన్ ఫాల్ట్ వల్ల వచ్చిన భూకంపంలో 17,000 మరణాలతో పాటు 1,20,000 గృహాలు కుప్పకూలడం, 2.50 లక్షల జనులు నిరాశ్రయులు కావడం చూసాం. 1900 సంవత్సరం తరువాత జరిగిన 76 తీవ్ర భూకంపాల్లో దాదాపు 90,000 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని అంచనా.

## శాస్త్రజ్ఞుల హెచ్చరికలు పెడచెవిన పెట్టారా..?

ఫిబ్రవరి 03 శుక్రవారం రోజున 'ఫ్రాంక్ హూగర్‌బీడ్స్' అనబడే డచ్ పరిశోధకులు టర్కీ, జోర్డన్, లెబనాన్, సిరియా ప్రాంతాల్లో 7.5 రిక్టర్ స్కేల్ కలిగిన తీవ్ర భూకంపం సమీప భవిష్యత్తులో రావచ్చని ట్వీట్ రూపంలో హెచ్చరించడం నేడు చర్చనీయాంశంగా మారింది. ఈ భూ ప్రళయం తరువాత కూడా వెంటనే తిరిగి భూకంపాలు రావచ్చని, ప్రజలు ముందు జాగ్రత్తగా ఉండాలని కూడా ఫ్రాంక్ హూగర్‌బీడ్స్ సలహాలు ఇవ్వడాన్ని పెడచెవిన పెట్టరాదు. ఈ భయానక, విధ్వంసకర భూ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు ఆవాసాలు కోల్పోవడం విచారకరమని ఫ్రాంక్ తెలియజేశారు. గోరుచుట్టుపై రోకలి పోటులా ఏళ్ళ తరబడి అంతర్యుద్ధంతో తిరుగుబాటుదారుల అధీనంలో అతలాకుతలం అవుతున్న సిరియాకు తాజా భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. భూకంపాల ముప్పు ఉన్న ప్రదేశాలుగా గుర్తించి హెచ్చరికలు చేస్తున్నప్పటికీ తుర్కియే, సిరియాల పాలకులు కనీస ముందు జాగ్రత్తలు, నిర్మాణ సమయాల్లో ప్రకంపనలు తట్టుకునేలా చర్యలు తీసుకోక పోవడంతో నష్టం అపారంగా కనిపిస్తున్నది. శాస్త్రజ్ఞుల హెచ్చరికలు భూకంపాలను నిరోధించనప్పటికీ ఆయా భూకంపాల ముప్పులను ఆయా దేశాల ప్రభుత్వాలు, పౌర సమాజం గమనించి కనీసం భూకంప నష్టాలను తగ్గించుకోవాలని విశ్వ మానవాళి విన్నవిస్తున్నది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' పథకం కింద భారత్ గౌరవ్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ రైలును ప్రవేశపెట్టనున్న భారతీయ రైల్వేలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:శక్తివంతమైన గుజరాత్ వారసత్వాన్ని ప్రదర్శించడానికి ఈ రైల్వే పర్యటనను కేంద్ర ప్రభుత్వ "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" పథకం తరహాలో రూపొందించారు. . కళాత్మకమైన భారత్ గౌరవ్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ రైలు ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ క్లాస్‌తో 8 రోజుల పాటు టూర్‌లు నిర్వహిస్తారు. టూరిస్ట్ రైలులో 4 ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లు, 2 రెండవ క్లాస్ ఎసి కోచ్‌లు ఉంటాయి. ఒక చక్కటి ప్యాంట్రీ కారు, రెండు రైలు రెస్టారెంట్లు ఉంటాయి. ఇందులో 156 మంది పర్యాటకులు ప్రయాణించవచ్చు. గుజరాత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, వారసత్వ ప్రదేశాల సందర్శన అంటే స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, చంపానేర్, సోమనాథ్, ద్వారక, నాగేశ్వర్, బేట్ ద్వారక, అహ్మదాబాద్, మోఢేరా, ఈ ప్రయాణంలో ప్రధాన ఆకర్షణలు.

పర్యాటకులు ఈ టూరిస్ట్ రైలులో గురుగ్రామ్, రేవారి, రింగాస్, ఫుల్లెరా, అజ్మీర్ రైల్వే స్టేషన్లలో కూడా ఎక్కవచ్చు.

భారతీయ రైల్వేలు తమ భారత్ గౌరవ్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ రైలును నడపడం ద్వారా వైబ్రెంట్ గుజరాత్ రాష్ట్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రదర్శించడానికి గర్వి గుజరాత్‌తో చాలా ప్రత్యేకమైన టూర్‌తో ముందుకు వచ్చాయి. ఐఆర్సీటీసి నిర్వహించే ఈ ప్రత్యేక పర్యాటక రైలు, 8 రోజుల పర్యటనలో ఢిల్లీ సఫ్దర్‌జంగ్ రైల్వే స్టేషన్ నుండి ఫిబ్రవరి 28న బయలుదేరుతుంది. పర్యాటకుల సౌకర్యార్థం గురుగ్రామ్, రేవారి, రింగాస్, ఫుల్లెరా, అజ్మీర్ రైల్వే స్టేషన్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ సౌకర్యం అందించారు.

ఈ రైలు టూర్ ప్యాకేజీని "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'' తరహాలో రూపొందించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జీవితం ఇతివృత్తంతో ఈ ప్రయాణం సాగుతుంది. ఈ రైలు టూర్ ప్యాకేజీ మొదటి స్టాపే కేవడియాలో ఉంటుంది, ఇందులో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఆకర్షణకు కేంద్రంగా ఉంటుంది. మొత్తం రైలు 8 రోజుల ప్రయాణంలో సుమారుగా 3500 కి.మీ.ల దూరాన్ని కవర్ చేస్తుంది.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం – స్టాట్యూ ఆఫ్ యూనిటీ, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన చంపానేర్ పురావస్తు ఉద్యానవనం, అడ్లేజ్ స్టెప్ వెల్, అహ్మదాబాద్‌లోని అక్షరధామ్ ఆలయం, సబర్మతి ఆశ్రమం, మోఢేరా సూర్య దేవాలయం, పటాన్‌లోని రాణి కి వావ్ యునెస్కో మరొక ప్రదేశం. టూర్ లో వారసత్వ సంపదలు చేర్చారు. వక్కన, సోమనాథ్ జ్యోతిర్లింగ సందర్శన, నాగేశ్వర్ జ్యోతిర్లింగ, ద్వారకాధీష్ ఆలయం, బేట్ ద్వారక 8 రోజుల పర్యటనలో కవర్ అయ్యే ఆధ్యాత్మిక ప్రదేశాలు. హోటళ్లలో రెండు రాత్రులు బస ఉంటుంది, కేవడియా, అహ్మదాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున, సోమనాథ్, ద్వారకలోని ప్రదేశాల సందర్శన పగటిపూట ఉంటుంది.

ద్వారకాధీశ దేవాలయం

స్టేట్ ఆఫ్ ఆర్ట్ డీలక్స్ ఏసీ టూరిస్ట్ రైలులో రెండు ఫైన్ డైనింగ్ రెస్టారెంట్లు, ఆధునిక వంటగది, కోచ్‌లలో షవర్ క్యూబికల్స్, సెన్సార్ ఆధారిత వాష్‌రూమ్ ఫంక్షన్‌లు, ఫుట్ మసాజర్ వంటి అద్భుతమైన ఫీచర్లు ఉన్నాయి. పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ రైలు ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ బోగీలు ఉంటాయి. రైలులో ప్రతి కోచ్‌కు సీసీటీవీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డ్‌ల మెరుగైన భద్రతా లక్షణాలు ఉన్నాయి. మొత్తం రైలులో ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ను కూడా ఉంటుంది.

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ప్రారంభం దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వ చొరవ ''దేఖో అప్నా దేశ్''కు అనుగుణంగా ఉంది.

ధరల శ్రేణి: ఎసి 2 టైర్‌లో ఒక్కొక్కరికి రూ. 52250/– , ఫస్ట్ ఏసీ (క్యాబిన్) ఒక్కొక్కరికి రూ. 67140, ఫస్ట్ ఏసీ (కూపే) ఒక్కొక్కరికి రూ. 77400/–.

8 రోజుల మొత్తం కలిపి ఈ టూర్ ప్యాకేజీ ఉంటుంది.

పైన పేర్కొన్న ప్యాకేజీ లో సంబంధిత తరగతిలో రైలు ప్రయాణం, ఏసీ హోటళ్లలో రాత్రి బస, అన్ని భోజనాలు (శాకాహారం మాత్రమే), అన్ని ట్రాన్స్ఫర్ లను కవర్ చేస్తుంది. పర్యాటక ప్రదేశాల సందర్శనకు అయ్యే బస్సు ప్రయాణం, ట్రావెల్ ఇన్సూరెన్స్, గైడ్ సేవలు ఈ ప్యాకేజీ కింద ఉంటాయి.

అవసరమైన అన్ని ఆరోగ్య జాగ్రత్త చర్యలు తీసుకుంటారు. ఐఆర్సీటిసి ... అతిథులకు సురక్షితమైన, మరపురాని అనుభూతిని అందించడానికి ప్రయత్నాలు చేస్తుంది.

ఈ ప్యాకేజీని మరింత ఆకర్షణీయంగా, ఎక్కువ మందికి అందుబాటులో ఉండేలా చేయడానికి, ఈఎంఐ సౌకర్యాన్ని ఇచ్చే సంస్థలతో కూడా ఐఆర్సీటిసి కలిసి పనిచేస్తుంది. ఈఎంఐ చెల్లింపు ఎంపికను అందించడానికి చెల్లింపు గేట్‌వేలతో భాగస్వామ్యం అయింది.

మరిన్ని వివరాల కోసం మీరు ఐఆర్సిటిసి వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చు: https:// www.irctctourism.com

బుకింగ్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది, ముందుగా వచ్చిన వారికి మొదట అవకాశం ఉంటుంది.

# పెరుగుతున్న భూతాపం, వాతావరణంలో వస్తున్న మార్పులపై జీ-20 సభ్య దేశాల ఉమ్మడి కృషి అవసరం.. కేంద్ర మంత్రి శ్రీ ఆర్.కే.సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:పెరుగుతున్న భూతాపం, వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కోడానికి జీ-20 సభ్య దేశాలు కలిసి కృషి చేయడానికి ముందుకు రావాలని కేంద్ర ఇంధన, నూతన పునరుత్పాదక శాఖ మంత్రి శ్రీ ఆర్.కే.సింగ్ పిలుపు ఇచ్చారు. బెంగళూరులో ఈరోజు ప్రారంభమైన ఇంధన పరివర్తనపై ఏర్పాటైన జీ-20 వర్కింగ్ గ్రూప్ సమావేశంలో మంత్రి ముఖ్య ఉపన్యాసం ఇచ్చారు.దేశ దేశ స్థూల ఉత్పత్తిలో (జీడీపీ) కర్బన ఉద్గారాల స్థాయిని 2005 నాటి స్థాయితో పోల్చి చూస్తే 2030 నాటికి 45 శాతానికి తగ్గించాలని నిర్ణయించిన భారతదేశం, లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని మంత్రి వివరించారు. 2030 శిలాజేతర ఇంధన ఆధారిత ఇంధన వనరుల నుంచి 50 శాతం విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చూసేందుకు దేశంలో చర్యలు అమలు జరుగుతున్నాయన్నారు. వాతావరణ మార్పుల పనితీరు సూచికలో భారతదేశం ప్రపంచంలో మొదటి 5 దేశాల జాబితాలో ఉందని శ్రీ సింగ్ వెల్లడించారు. దేశంలో తలసరి గ్రీన్ హౌస్ వాయువు విడుదల తక్కువగా ఉందన్నారు.

ప్రపంచ సగటు 6.3 టిసిఓ2తో పోల్చి చూస్తే 2020లో దేశంలో తలసరి గ్రీన్ హౌస్ వాయువు విడుదల తక్కువగా ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఇంధన పొదుపు పథకాల వల్ల దేశంలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదల 267.9 మిలియన్ టన్నుల వరకు తగ్గిందని శ్రీ సింగ్ అన్నారు. దీనివల్ల వి 18.5 బిలియన్ డాలర్ల వరకు వ్యయం తగ్గుతుందని అన్నారు.

సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కేంద్ర మంత్రి ఇంధన రంగంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇంధన భద్రత లక్ష్యం సాధించేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకుంటామని తెలిపారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు ఇంధన పరివర్తనపై ఏర్పాటైన జీ-20 వర్కింగ్ గ్రూప్ సమావేశం సహకరిస్తుందని మంత్రి అన్నారు.

సమావేశంలో ప్రసంగించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి పరిశుద్ధ ఇంధనాన్ని అందించేందుకు ప్రపంచ దేశాలు కలిసి కృషి చేయాల్సి ఉంటుందని అన్నారు. ' పర్యావరణ దోపిడీకి కాకుండా పర్యావరణ పరిరక్షణ,పర్యావరణహిత జీవన శైలికి భారతదేశం ప్రాధాన్యత ఇస్తోంది. వనరుల వినియోగం తగ్గించడం, పునర్వినియోగం, రీ సైకిల్ విధానాలు భారతీయ జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్నాయి.దేశం సంస్కృతి, జీవన విధానంలో వృత్తాకార ఆర్థిక వ్యవస్థ భాగంగా ఉంది' అని శ్రీ జోషి వివరించారు.

ఈ సందర్భంగా శ్రీ జోషి గ్లాస్గో లో జరిగిన కాప్ 26 సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన ప్రకటనను ప్రస్తావించారు. అనవసరంగా కాకుండా అవసరాల మేరకు మాత్రమే వనరులను ఉపయోగిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం భారతదేశం పర్యావరణహిత జీవన విధానం కోసం ప్రజల సహకారంతో కృషి చేస్తుందని శ్రీ మోదీ చేసిన ప్రకటనను శ్రీ జోషి గుర్తు చేశారు.

జీ-20 అధ్యక్ష బాధ్యతలు భారతదేశం చేపట్టిన తర్వాత జరుగుతున్న మొదటి ఇటిడబ్ల్యుజి సమావేశం సాంకేతిక అంతరాలను పరిష్కరించడం ద్వారా శక్తి పరివర్తన వంటి ఆరు ప్రధాన ప్రాధాన్యత రంగాలపై దృష్టి పెడుతుంది. ఇంధన సరఫరా కోసం తక్కువ ఖర్చుతో నిధులు సమకూర్చడం, ఇంధన భద్రత, విభిన్న సరఫరా వ్యవస్థలు, శక్తి సామర్థ్యం, పారిశ్రామిక రంగం ద్వారా తక్కువ పరిమాణంలో కార్బన ఉద్గారాల విడుదల, బాధ్యతాయుతమైన వినియోగం, భవిష్యత్తు కోసం ఇంధన వనరులు, అందరికీ అందుబాటులో ఉండే విధంగా సరసమైన సమ్మిళిత ఇంధన శక్తి సరఫరా అంశాలపై సమావేశం దృష్టి సారిస్తుంది. 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే ఇతివృత్తం ఆధారంగా సదస్సు జరుగుతుంది.

బ్రెజిల్ విదేశీ సంబంధాల మంత్రిత్వ శాఖ పునరుత్పాదక ఇంధన విభాగాధిపతి రెనాటో డొమిత్ గోడిన్హో, కార్యదర్శి (శక్తి) శ్రీ అలోక్ కుమార్, భారతదేశానికి చెందిన జీ-20 సౌస్ షెర్పా శ్రీ అభయ్ ఠాకూర్, నీతి ఆయోగ్ సభ్యుడు శ్రీ వి.కె.సరస్వత్ సమావేశంలో ప్రసంగించారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ), పలు అంతర్జాతీయ సంస్థలతో పాటు జీ20 దేశాలు, తొమ్మిది ప్రత్యేక ఆహ్వానిత దేశాలు సహా 150 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా ' కర్బన సేకరణ, వినియోగం,నిల్వ (సీసీయూఎస్); అనే అంశంపై విడిగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. శూన్య విడుదల లక్ష్యాలను సాధించడానికి కర్బన సేకరణ, వినియోగం,నిల్వ అంశం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కీలకమైన అంశం సదస్సులో చర్చకు వచ్చింది.

# బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు మరోసారి దగా

**–బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాల సుదాకర్**

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టినటువంటి రాష్ట్ర బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు మరోసారి దగా చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పగిడాల సుదాకర్ విమర్శించారు. 60 శాతం జనాభా ఉన్నటువంటి బీసీల సంక్షేమానికి కేవలం రెండు శాతం నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు అరకొర నిధులు కేటాయిస్తూ అడుగడుగునా అన్యాయం చేస్తుందని ఆయన తెలిపారు బీసీలకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా నిధులు కేటాయిస్తామని నిండు అసెంబ్లీలో గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు ఈ బడ్జెట్ లో ఆ ఊసే లేకపోవడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం 2 లక్షల 90 వేల కోట్ల 396 కోట్లు ఉంటే బీసీల సంక్షేమానికి కేవలం 6, 229 కోట్లు కేటాయించి బీసీలకు మరోసారి మొండి చేయి చూపించిందని ఆయన అన్నారు, పెరిగిన బడ్జెట్ దామాషా ప్రకారం బీసీల బడ్జెట్ పెంచడం లేదని ఆయన అన్నారు.బీసీలకు గతంలో ఇచ్చినటువంటి బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంపీలు సిఫార్సుల అమలుకు కనీసం చర్యలు తీసుకోలేదని ఆయన దుయ్యబట్టారు.బీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని, 50% పైగా ఉన్న బీసీల సంక్షేమానికి ఐదు శాతం కూడా నిధులు కేటాయించరా అని కేంద్రాన్ని ప్రశ్నించిన వారే ఈరోజు బీసీలకు కనీసం రాష్ట్ర ప్రభుత్వ మైన వారి మాట ప్రకారమైన ఐదు శాతం నిధులు కేటాయించకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్లో 20000 కోట్లు కేటాయించాలని బీసీలకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా మరో 25 వేల కోట్లు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

# గొప్పలు తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదు: భట్టి విక్రమార్క

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రేస్స్ న్యూస్ );: బీఆర్ఎస్ గొప్పలు చెప్పుకోవడం తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ బడ్జెట్‌తో బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రుణ మాఫీ ఏమైంది? అని ఆయన ప్రశ్నించారు. హరీశ్‌రావు అంకెల గారడి, మాయమాటలు తప్ప బడ్జెట్‌లో ఏమీలేదని విమర్శించారు. గత బడ్జెట్ హామీలే ఇప్పటికీ అమలు కాలేదని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. హామీలతోనే కేసీఆర్ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందన్నారు

# 2023-24 బడ్జెట్‌లో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయింపు 2022-23 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే 38.45% పెరుగుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ప్రధాన్ మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సాహ్-యోజన (పిఎం-ఎంకెఎస్ఎస్‌వై) పేరుతో కొత్త ఉప పథకాన్ని ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి:పిఎంఎంఎస్‌వై కింద సెంట్రల్ సెక్టార్ సబ్-స్కీమ్.

పంచాయతీ స్థాయిలో మత్స్య సహకార సంఘాలతో పాటు ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటుపై బడ్జెట్ ప్రసంగం నొక్కి చెప్పింది.

పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమలపై దృష్టి సారించి వ్యవసాయం, అనుబంధ రంగాలకు రుణ లక్ష్యాన్ని 20 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు అగ్రికల్చరల్ యాక్సిలరేటర్ ఫండ్ మత్స్య సంపద విలువ గొలుసు చుట్టూ ఆవిష్కరణలను ముమ్మరం చేస్తుంది.

2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను సమర్పించిన కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ఫిషరీస్ శాఖకు రూ. 2248.77 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. 2022-23లో ఈ మొత్తం రూ.1624.18 కోట్లుగా ఉంది. అదే విధంగా 2021-22లో ఈ మొత్తం రూ.1360 కోట్లుగా ఉంది. ఇది గత ఆర్థిక సంవత్సరం 2022-23 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌తో పోలిస్తే ఇది 38.45% పెరుగుదలను సూచిస్తుంది. అలాగే డిపార్ట్‌మెంట్‌కు అత్యధిక వార్షిక బడ్జెట్ మద్దతులో ఇది ఒకటి నిలిచింది.

ప్రధాన్ మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సాహ్-యోజన (పిఎం-ఎంకెఎస్ఎస్‌వై) పేరుతో కొత్త ఉప-పథకాన్ని ఆమె ప్రకటించారు: పిఎంఎంఎస్‌వై కింద సెంట్రల్ సెక్టార్ సబ్-స్కీమ్ రూ.6,000 కోట్ల లక్ష్య పెట్టుబడితో ఆదాయాలను మరింత పెంచే లక్ష్యంతో మత్స్యకారులు, చేపల విక్రేతలు మరియు మత్స్య రంగంలో నిమగ్నమైన సూక్ష్మ ఉ చిన్న సంస్థలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. పిఎం-ఎంకెఎస్ఎస్‌వై మత్స్య రంగాన్ని లాంఛనప్రాయంగా తీసుకురావడానికి కేంద్రీకృత జోక్యాన్ని ఊహించింది. ఇందులో డిజిటల్ ఇన్‌క్లూజన్, క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ మరియు వర్కింగ్ క్యాపిటల్ కోసం ఇన్‌స్టిట్యూషనల్ ఫైనాన్స్‌కు యాక్సెస్‌ను సులభతరం చేయడం, ఆక్వాకల్చర్ మరియు ఫిషరీస్ ప్రోత్సహిస్తున్న మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లో రిస్క్ తగ్గించడానికి సిస్టమ్ మరియు ఇన్‌స్టిట్యూట్‌లను తీసుకురావడానికి ప్రోత్సాహకాలు ఉన్నాయి. ఫిషరీస్ మరియు ఆక్వాకల్చర్ రంగ విలువ-గొలుసు సామర్థ్యాలపై పనిచేయడానికి, వినియోగదారులకు సురక్షితమైన ఉత్పత్తులను అందించడానికి సరఫరా గొలుసులను ఏర్పాటు చేయడంలో సూక్ష్మ మరియు చిన్న సంస్థలను ప్రోత్సహించడం, తద్వారా దేశీయ మార్కెట్‌ను విస్తరించడం మరియు ఈ రంగంలో మహిళలకు ఉద్యోగాల సృష్టి మరియు నిర్వహణ కోసం ప్రోత్సాహకాలు ఈ పథకం కింద ఉంటాయి.

పంచాయతీ స్థాయిలో మత్స్య సహకార సంఘాలతో పాటు ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటుపై కూడా బడ్జెట్ ప్రసంగం వివరించింది. గ్రాస్ రూట్ స్థాయిలో సహకార సంఘాలను ఏర్పాటు చేయడం వల్ల ఈ రంగాన్ని బలోపేతం చేస్తుంది. అలాగే మత్స్యకారులు మరియు చేపల పెంపకందారులు చేపల ఉత్పత్తిని మరియు దాని పంటకోత అనంతర కార్యకలాపాలను వ్యవస్థీకృత పద్ధతిలో నిర్వహించడానికి అధికారం పొందుతారు. సహకార మంత్రిత్వ శాఖకు రూ.900 కోట్ల కేటాయింపుతో సహకార సంఘాల అభివృద్ధికి, రుణాలకు పరిమితులు పెంపు, టీడీఎస్ పరిమితులు మరియు నగదు డిపాజిట్లు మరియు జాతీయ సహకార డేటాబేస్ నిర్మాణానికి తీసుకోవలసిన చర్యలు సహకార కార్యకలాపాలు మరియు ఫైనాన్సింగ్‌ను సులభతరం చేస్తాయి. ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందడానికి సహాయం చేస్తుంది. నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ సొసైటీ, నేషనల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ మరియు నేషనల్ లెవెల్ మల్టీ-స్టేట్ సీడ్ కో-ఆపరేటివ్ సొసైటీ స్థాపనపై గతంలో చేసిన ప్రకటనతో పాటు, పైన పేర్కొన్నవి విత్తన రంగాలలో మత్స్య సంపదకు తోడ్పడతాయని భావిస్తున్నారు.

పశుపోషణ, పాడిపరిశ్రమ, మత్స్య రంగాలపై దృష్టి సారించిన ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాల రుణ లక్ష్యాన్ని 20 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇది మత్స్య రంగానికి సంస్థాగత ఫైనాన్స్ ప్రవాహాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఇంకా రొయ్యల మేత కోసం అవసరమైన కొన్ని ఇన్‌పుట్‌లపై దిగుమతి సుంకాన్ని తగ్గించే ప్రకటన దిగుమతుల ఖర్చు మరియు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తుంది మరియు ఫలితంగా ఆక్వాకల్చర్ ఎగుమతులను పెంచుతుంది మరియు ప్రోత్సహిస్తుంది. చేపల మేతపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని 15% నుండి 5%కి, క్రిల్ మీల్‌పై 15% నుండి 5%కి, ఆల్గల్ ప్రైమ్ (పిండి)పై 30% నుండి 15%కి, ఫిష్ లిపిడ్ ఆయిల్‌పై 30% నుండి 15% వరకు తగ్గింపు, మినరల్ మరియు విటమిన్ ప్రీమిక్స్ 15% నుండి 5% వరకు తగ్గింపు ఆక్వాటిక్ ఫీడ్ తయారీ ధరను తగ్గిస్తుంది. ఈ చర్యలు దేశీయ దాణాను ప్రోత్సహిస్తుంది మరియు భారతీయ రొయ్యల ఎగుమతి పోటీని గణనీయంగా మెరుగుపరుస్తుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం భారతదేశంలో 3 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ప్రకటన భారతదేశంలోని ఏఐ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. ఇది చేపల మార్కెటింగ్ వ్యవస్థలను మెరుగుపరచడానికి మరియు గుర్తించదగిన మరియు నాణ్యత కోసం బ్లాక్-చైన్ ఆధారిత పరిష్కారాన్ని వేగవంతంగా అమలు చేయడం ద్వారా విలువను పెంచడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుంది.

ప్రతిపాదిత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు అగ్రికల్చరల్ యాక్సిలరేటర్ ఫండ్ మత్స్య సంపద విలువ గొలుసు ఆధారిత ఆవిష్కరణలను తీవ్రతరం చేస్తుంది. మొత్తంమీద 2023-24 బడ్జెట్ సంస్థాగత క్రెడిట్‌కు మెరుగైన ప్రవాహం, నష్టాలను తగ్గించడానికి పెరిగిన సాధనాలు, దేశీయ మరియు ఎగుమతి మార్కెట్ల విస్తరణకు ప్రోత్సాహకాలు మరియు వేగవంతం చేయడం ద్వారా మత్స్య మరియు ఆక్వాకల్చర్ రంగంలో వేగవంతమైన వృద్ధికి కొత్త దశను అందించడంలో సహాయపడుతుంది. ఈ ఆవిష్కరణల ద్వారా భారతదేశం వివిధ అంశాల్లో ముందుకు సాగుతుంది మరియు ప్రపంచవ్యాప్తంగా తన ఉనికిని చాటుతుంది.

వివిధ రంగాలలో భారతీయ మత్స్య రంగం చాలా ఆరోగ్యకరమైన వేగంతో అభివృద్ధి చెందుతోంది. భారతదేశం ఇప్పటికే 3వ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా, 2వ అతిపెద్ద ఆక్వాకల్చర్ ఉత్పత్తిదారుగా మరియు చేపలు మరియు మత్స్య ఉత్పత్తులలో 4వ అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించింది. ఇది 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వార్షిక వృద్ధి రేటు 10.34%గా ఉంది మరియు సమీప భవిష్యత్తులో మరింత వృద్ధితో 162.48 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని రికార్డు చేసింది. ఈ రంగం 28 మిలియన్లకు పైగా ప్రజలకు స్థిరమైన జీవనోపాధిని కల్పిస్తోంది మరియు పేదలు మరియు అణగారిన వర్గాల సామాజిక-ఆర్థిక పరిస్థితులలో స్థిరమైన మెరుగుదలను తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తోంది.నాలుగు సంవత్సరాల క్రితం, 5 ఫిబ్రవరి 2019న పశు సంవర్ధక, పాడిపరిశ్రమ ఉ ఫిషరీస్ శాఖ నుండి ఫిషరీస్ శాఖను రూపొందించడం ద్వారా మత్స్య రంగానికి పెద్ద ప్రోత్సాహం లభించింది. అదే సమయంలో, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) వంటి దార్శనిక పథకాలు మరియు కార్యక్రమాలు, ఫిషరీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎఫ్ఐడిఎఫ్) మరియు కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి)లు రూ. 27500 కోట్ల మొత్తం పెట్టుబడితో ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమాలు వాటి ప్రభావాన్ని చూపడం ప్రారంభించాయి. తద్వారా అమృత్ కాల్ సమయంలో కొత్త ఎత్తులను సాధించేందుకు రంగం సిద్ధమైంది.

# ముమ్మరంగా తిరుపతి స్టేషన్ పునరాభివృద్ధి పనులు



తిరుపతి, ఫిబ్రవరి 7:రాబోయే 40 ఏళ్ల ను దృష్టిలో ఉంచుకొని రైలు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు దక్షిణ మధ్య రైల్వే , తిరుపతి స్టేషన్ పునరాభివృద్ధి పనులను చేపట్టింది. మే 2022లో ప్రారంభించిన ఈ పునరాభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పనులు నకాలంలో పూర్తయ్యేలా అన్ని స్థాయిలలో పనిని పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులను చేపట్టేందుకు ఈపిసి విధానంలో కాంట్రాక్టు అప్పగించడం జరిగింది. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి మొత్తం పనులు ఫిబ్రవరి 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న తిరుపతి స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం రాబోతోంది. జియోలాజికల్ సర్వే పూర్తయిన తర్వాత, క్యాంపు కార్యాలయం, కాంక్రీట్ ల్యాబ్ & స్టోరేజీ షెడ్ల ఏర్పాటు కు సంబంధించిన పనులతో పాటు మిగిలిన పనులు కుడా వేగంగా కొనసాగుతున్నాయి. కొత్త స్టేషన్ భవనానికి పునాదులు కాంక్రీటింగ్ పనులు 100 శాతం పూర్తయ్యాయి. ఇప్పటి వరకు, ఫౌండేషన్‌లు, బేస్‌మెంట్ ఫ్లోర్ యొక్క స్తంభాలు, రిటైనింగ్ వాల్‌లో సుమారు 7,450 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును ఉపయోగించారు. తదుపరి దశలో, బేస్‌మెంట్ ఫ్లోర్ కోసం కాంక్రీట్ స్లాబ్‌ను సెంట్రింగ్, షట్టరింగ్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి.

ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి సంబందించిన పనులు ఇప్పటి వరకు దాదాపు 20% మేర పనులు పూర్తయ్యాయి.

కొత్త స్టేషన్ భవనంలో 29 లీటర్ల నీటిని నిల్వచేసే సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు కానుంది.

దీని కోసం, భూగర్భ ట్యాంకు నిర్మాణ కోసం తవ్వకం పనులు మరియు పునాదులకు కాంక్రీటింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. తిరుపతి రైల్వే స్టేషన్ ను పునరాభివృద్ధిలో భాగంగా స్టేషన్ కు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం రెండు కొత్త ఎయిర్ కాన్‌కోర్సులను నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ ఎయిర్‌కోర్స్‌లు 35 మీటర్ల వెడల్పుతో ఉంటాయి . స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లను మరియు స్టేషన్ భవనాలకు రెండు వైపులా (ఉత్తరం మరియు దక్షిణం) కలుపుతాయి. ప్లాట్ ఫారం నెం 4 & 5లో ఎయిర్‌కోర్సుల పునాదుల కోసం తవ్వకం పనులు ప్రారంభించబడింది.

ఇందుకు సంబంధించి పనులు వేగంగా సాగుతున్నాయి. తిరుపతి స్టేషన్ పునరాభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, తద్వారా పనులకు ఆటంకం కలగకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు, రైళ్ల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# బీహార్ దొంగలా మాజికా.. ఏకం రైలు పట్టాలనే 'లేపేశారు'..!

బీహార్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):దొంగతనాలకు అలవాటు పడిన వారికి ఏదో ఒకటి కొట్టయకుండా ఉండలేరు. ఇలాంటి వాళ్ళు ఎవరైనా సరే చేతికందే వస్తువులనో.. ఓ మోస్తరు బరువున్న వస్తువులనో దొంగిలించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అయితే బీహార్ లోని ఓ దొంగల ముఠా మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించి వార్తల్లో నిలవడం గమనార్హం.ఇటీవల రైలు ఇంజన్ ను పార్ట్ పార్టులుగా చేసి పట్టుకెళ్లగా బీహార్ దొంగల ముఠా తాజాగా రైలు పట్టాలను సైతం దొచుకెళ్లడం వైరల్ గా మారింది. రైలు ఇంజన్ తో పాటు ట్రాక్ సైతం మాయం కావడంతో రైల్వే అధికారులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటనపై ఆర్పీఎఫ్ అధికారులు విచారణ చేపట్టగా ఇంటి దొంగల హస్తం ఉన్నట్లు బయటపడింది.ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. బీహార్లోని సమస్తిపూర్ జిల్లాలో లోహత్ చక్కెర కర్మాగారం ఉండగా అది కొన్నాళ్ల క్రితం మూతపడింది. అప్పట్లో ఈ చక్కెర ఫ్యాక్టరీ నుంచి సరకు లోడింగ్.. అన్ లోడింగ్ కోసం లోపలికి గూడ్స్ రైలు వెళ్లేలా ట్రాక్ నిర్మించారు. అయితే ఫ్యాక్టరీ మూత పడటంతో ఆ ట్రాక్ నిరుపయోగంగా మారింది. ఈక్రమంలోనే చక్కెర ఫ్యాక్టరీ సామాన్లు తుక్కు కింద కొనుక్కోడానికి ఓ కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ కంపెనీకే రైల్వే ట్రాక్ ఊడదీసి పనులు సైతం ఇవ్వాలని అధికారులు ఒప్పందం చేసుకోవాలని భావించారు. అయితే ఈ సమాచారం ముందే లీక్ కావడంతో ఇంటి దొంగల సహకారంతో ఓ ముఠా రైల్వే ట్రాక్ ఊడదీసుకొని పోయింది.రైల్వే ట్రాక్ మాయం కావడంతో చక్కెర కర్మాగారంలో పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చింది. అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా అక్కడ రైల్వే ట్రాక్.. సిమెంట్ కమ్మీలు.. ఏవీ లేవు కనబడలేదు. మొత్తంగా ఊడ్చు కెళ్లారు. అయితే వీటిని తరలించడం అంత సులభం కాదని రైల్వే అధికారులు చుట్టుపక్కల గోడౌన్లలో వెతికారు.ఓ వ్యక్తి ఇంట్లో కొన్ని పట్టాలు లభించడంతో రైల్వే అధికారులు విచారణ వేగవంతం చేశారు. తీగలాగితే డొంక కదిలిన చందంగా ఇందులో రైల్వే అధికారుల హస్తం ఉన్నట్లు వెలుగుచూసింది. దీంతో ఇద్దరు రైల్వే సిబ్బందిని రైల్వే శాఖ సస్పెండ్ చేసింది. ఆర్పీఎఫ్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దొంగల ముఠా నాయకుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు.అయితే ఇలాంటి భారీ దొంగతనాలు బీహార్లో కొత్త కాదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆ మధ్య ఓ ఇంటిపై అమర్చిన సెల్ టవర్ ను సైతం ఓ దొంగ ముఠా ఎత్తుకెళ్లి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తాజా రైలు ఇంజన్ ను కాకుండా ఏకంగా పట్టాలను సైతం ఎత్తుకెళ్లి బీహార్ దొంగలు మామూలోళ్లు కాదని మరోసారి నిరూపించుకున్నారు.

# మొదటి యూత్ 20 (వై 20) ప్రారంభ సమావేశం 2023 గౌహతిలో ప్రారంభమవుతుంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:జీ 20 కిక్ కింద మొదటి యూత్20 (జ20) ప్రారంభ సమావేశం 2023 ఈరోజు గౌహతిలో ప్రారంభమైంది. సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడిన యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి. మీటా రాజీవ్‌లోచన్ మాట్లాడుతూ, యూత్ 20 చర్చలు యువతకు చేరువ కావాలని , వారి రేపటి ఉజ్వల భవిత కోసం వారి ఆలోచనల కోసం వారితో సంప్రదింపులు జరపాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఎడమ నుండి కుడికి ఎస్ బీ నారాయణన్, డైరెక్టర్ జనరల్, ఎన్ ఈ జోన్, మినిస్ట్రీ ఆఫ్ ఐ & బీ, భారత ప్రభుత్వం, శ్రీమతి మీటా రాజీవ్లోచన్, ఎం/ఓ యూత్ అండ్ యూత్ అఫైర్స్, కళ్యాణ్ చక్రవర్తి, అసోం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు ఐఐటీ గౌహతి డైరెక్టర్ ప్రొఫెసర్ పరమేశ్వర్ కె అయ్యర్

మూడు రోజుల ఈవెంట్‌లో చర్చించాల్సిన వై20 యొక్క ఐదు థీమ్‌లను శ్రీమతి. రాజీవ్‌లోచన్ హైలైట్ చేశారు, అవి ఉపాధి యొక్క భవిష్యత్తు: పరిశ్రమ 4.0, ఆవిష్కరణలు మరియు 21వ శతాబ్దం; శీతోష్ణస్థితి మార్పు మరియు విపత్తు ప్రమాదాన్ని తగ్గించడం: సుస్థిరత్వాన్ని జీవిత మార్గంగా మార్చడం; శాంతి నిర్మాణం మరియు సయోధ్య: యుద్ధం లేని యుగంలో ప్రవేశించడం; ఉమ్మడి భవిత: ప్రజాస్వామ్యం – పాలన లో యువత ; ఆరోగ్యం, శ్రేయస్సు & క్రీడలు: యువత కోసం ఎజెండా. ప్రతి థీమ్ దేశంలోని వివిధ ప్రాంతాలలోని ప్రజల ఆకాంక్షలను ప్రతిధ్వనిస్తుంది మరియు ప్రతి ప్రాంతానికి ఈ ఇతివృత్తాలపై వారి స్వంత దృక్పథాలు ఉన్నాయి, దేశమంతటా సంప్రదింపులను విస్తరించడానికి ఇదే కారణమని ఆమె చెప్పారు.

శ్రీమతి రాజీవ్‌లోచన్ కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి శ్రీ. అనురాగ్ సింగ్ ఠాకూర్ వై 20 ప్రతినిధులతో 'యూత్ డైలాగ్' నిర్వహిస్తారు, తర్వాత ఫిబ్రవరి 8న వివిధ అంశాలపై శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేస్తారని చెప్పారు.

ఫిబ్రవరి 7న ఐఐటీ గౌహతిలో జరగనున్న ప్యానెల్ చర్చల గురించి ఆమె మాట్లాడుతూ, శాంతి నిర్మాణం మరియు సయోధ్య అనే ఈశాన్య ప్రాంతాలకు సంబంధించిన చాలా సంబంధిత అంశంపై ప్రముఖ వక్తలు చర్చిస్తారని చెప్పారు. ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు చరిత్ర ఉందని, ఈ థీమ్ అస్సాం మరియు మొత్తం ఈశాన్య ప్రజలకు చాలా సందర్భోచితంగా ఉంటుందని ఆమె అన్నారు.

ప్యానెల్ చర్చలో ఉల్ఫా మరియు ఎన్‌డిఎఫ్‌బికి చెందిన ఇద్దరు లొంగిపోయిన తిరుగుబాటుదారులు కూడా ప్యానెల్ చర్చలో పాల్గొంటారు.

అస్సాం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ కళ్యాణ్ చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు యువతకు వై 20 గురించి అవగాహన కల్పించడానికి మరియు దేశ నిర్మాణ ప్రక్రియలో వారిని భాగస్వామ్యం చేయడానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. వై20లోని 5 ఇతివృత్తాలపై నిర్వహించిన సెమినార్, డిబేట్, వర్క్‌షాపులు, క్విజ్ పోటీల్లో అస్సాంలోని దాదావు 36 విద్యాసంస్థలు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. దాదావు 4000 పాఠశాలలు వై20 కార్యక్రమాల్లో పాల్గొన్నాయని ఆయన తెలియజేశారు.

ఐఐటి గౌహతి డైరెక్టర్ ప్రొఫెసర్ పరమేశ్వర్ కె అయ్యర్ మాట్లాడుతూ వై20 ఈవెంట్‌ల టెక్నికల్ సెషన్‌లు మరియు చర్చలను ఐఐటి గౌహతి నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వంటి అధునాతన సాంకేతికతలకు ఐ ఐ టీ గౌహతి ఒక ప్రధాన పరిశోధనా కేంద్రం అని ఆయన నొక్కి చెప్పారు; ఈ సాంకేతికతల్లో కొన్ని పరిశ్రమలకు బదిలీ ప్రక్రియలో ఉన్నాయి. ఉపాధి యొక్క భవిష్యత్తు, ఇరవై ఒకటవ శతాబ్దపు నైపుణ్యాలు, వాతావరణ మార్పు, స్థిరత్వాన్ని జీవన విధానంగా మార్చడం మరియు శాంతి నిర్మాణం మరియు సయోధ్యపై ఐఐటి గౌహతిలో కీలక చర్చలు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన వై20 అవగాహన కార్యక్రమాల గురించి మాట్లాడుతూ, ఐ & బీ మంత్రిత్వ శాఖ యొక్క ఎన్ ఈ జోన్ డైరెక్టర్ జనరల్ శ్రీ బీ నారాయణన్, అస్సాం ప్రభుత్వ విద్యా శాఖతో కలిసి పీ ఐ బీ గౌహతి అస్సాం వ్యాప్తంగా దాదాపు 50 మంది విద్యార్థులకు డాక్యుమెంటేషన్, మొబైల్ ఫోటోగ్రఫీ మరియు రిపోర్టింగ్‌పై శిక్షణ ఇచ్చిందని తెలియజేశారు. శ్రీ నారాయణన్ విద్యార్థుల కృషిని అభినందిస్తూ శిక్షణ పొందిన 50 మంది విద్యార్థులలో 9 మంది విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించినందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సత్కారానికి ఎంపికయ్యారని తెలియజేశారు.

అస్సాం ముఖ్యమంత్రి శ్రీ. హిమంత బిస్వా శర్మ అస్సాం విద్యార్థులు మరియు విద్యావేత్తల నుండి పరిశోధన పత్రాలను కూడా సమర్పించనున్నారు. దీనికి అదనంగా, ఐ ఐ టీ గౌహతిలో సాంకేతిక సెషన్‌లు మరియు చర్చలు నిర్వహించబడతాయి. ప్రముఖ వక్తలు జనరల్ వీ కే సింగ్, శ్రీ. జీ పీ సింగ్, తేజస్వి సూర్య తదితరులు పాల్గొంటారు. ఇంకా, బ్రహ్మపుత్ర శాండ్‌బార్ ద్వీపంలో వై 20 ప్రతినిధులతో ఐస్ బ్రేకింగ్ సెషన్ జరుగుతుంది.

వై 20 – 2012లో ప్రారంభించబడింది, వై–20 అనేది జీ–20 సమ్మిట్‌ల యొక్క యువ విభాగం, ఇది జీ–20తో నిమగ్నమవ్వడానికి యువతకు అధికారికంగా గుర్తింపు పొందిన ఏకైక వేదిక, ఇది యువ నాయకుల కోసం అత్యంత ప్రభావవంతమైన అంతర్జాతీయ దౌత్య వేదికలలో ఒకటి. జీ–20 గొడుగు కింద ఎనిమిది అధికారిక సమూహాలలో ఇది కూడా ఒకటి.

# విదేశీ చదువులకు పెరుగుతున్న క్రేజ్..

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);విదేశాల్లో విద్యను అభ్యసించాలని ఆశిస్తున్న వారి సంఖ్యలో భారత్ లో రోజురోజుకు పెరిగిపోతోంది. విదేశాల్లో గ్రాడ్యుయేషన్.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి భారత్ లోనూ యమ డిమాండ్ ఉంది. విదేశాలకు భారతీయులు చదువు కోసం వెళుతూ అక్కడే మంచి ఉద్యోగం చూసుకొని సెటిల్ అవుతున్నారు. ఇలాంటి వారికి తమ బంధువుల్లో ఫుల్ క్రేజ్ దక్కుతోంది.ఈ నేపథ్యంలో చాలామంది విదేశాల్లో చదువుకోవాలని ఆసక్తిని కనబరుస్తున్నారు. కొందరు స్టేటస్ సింబల్ కోసం విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తుంటే మరికొంతమంది కొత్త కోర్సులు.. మంచి ఉద్యోగాలు లభిస్తాయనే ఆశలతో విదేశాలకు పయనమవుతున్నారు. ఇలాంటి వారిని చూసి మరికొందరు అప్పు చేసి మరీ విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు ఆసక్తిని చూపుతున్నారు.విదేశాల్లో చదువు పూర్తి చేసిన వారికి అక్కడే మంచి అవకాశాలు లభిస్తుండగా మన దేశంలోనూ అలాంటి వారికి మల్టీనేషనల్ కంపెనీలు రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. దీంతో చాలామంది భారతీయులు విదేశాల్లో చదువుకునేందుకు వలస వెళుతున్నారు. వీలైతే అక్కడే సెటిల్ అవుతున్నారు. కుదరకపోతే తిరిగి భారత్ కు వచ్చి మంచి కంపెనీల్లో ఉద్యోగాలు దక్కించుకుంటున్నారు.

మన దేశంలో చదివే వారి కంటే విదేశాల్లో చదివే వారికే కంపెనీలు సైతం పెద్దపీట వేస్తుండడంతో విద్యార్థులంతా విదేశీ మోజులో పడిపోతున్నారు. గత ఆరేళ్ల కాలంలో విదేశీ విద్య కోసం మన దేశం నుంచి 30 లక్షల మంది వెళ్లారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2017 నుంచి 2022 వరకు భారతీయ విద్యార్థులు 30 లక్షల వరకు దేశం విడిచి వెళ్లినట్లు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ లోక్ సభలో వెల్లడించింది. ఈ గణాంకాలను ఒకసారి పరిశీలించినట్లయితే..! 2017 సంవత్సరంలో 4.54 లక్షల మంది.. 2018లో 5.17 లక్షల మంది.. 2019లో 5.86 లక్షల మంది.. 2020లో 2.59లక్షల మంది.. 2021లో 4.40లక్షల మంది.. 2022 సంవత్సరంలో 7.50లక్షల మంది చదువుల కోసం విదేశాలకు వెళ్లినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొనడం గమనార్హం.కాగా కరోనా పరిస్థితుల కారణంగా 2020 2021 సంవత్సరాల్లో విదేశాలకు వెళ్లిన విద్యార్థుల సంఖ్య తక్కువగా కన్పిస్తోంది. ఏది ఏమైనా ఈ గణాంకాలను పరిశీలిస్తే ప్రతియేటా విదేశీ విద్య కోసం విదేశాలకు వెళుతున్న భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అర్థమవుతోంది.

# కనకదుర్గమ్మ ఆలయానికి..నూతన పాలకమండలి

విజయవాడ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయానికి.. 15 మందితో కూడిన నూతన పాలకమండలిని ఏపీ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు 15 మంది సభ్యులతో కూడిన పేర్లను విడుదల చేసింది.ఈ పాలకమండలిలో కర్నాటి రాంబాబు, కేసరి నాగమణి, కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, నిడమనూరి కల్యాణి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, కొలుకులూరి రామసీత, మారం వెంకటేశ్వరరావు, అల్లూరి కృష్ణవేణి, వేదకుమారిని పాలక మండలి సభ్యులుగా చేరుస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ 15 మంది సభ్యులు కలిసి పాలకమండలి ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

# ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి : టీటీడీ జేఈవో సదా భార్గవి



తిరుపతి, ఫిబ్రవరి 7: టీటీడీ గోశాలలో నిర్మిస్తున్న ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, అగర బత్తీల రెండో యూనిట్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జేఈవో శ్రీమతి సదా భార్గవి అధికారులను ఆదేశించారు. అధికారులతో కలసి మంగళవారం ఆమె ఈ పనుల ప్రగతిని పరిశీలించారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ లో చివరి దశలో ఉన్న సివిల్, విద్యుత్ , యంత్రాల పనితీరు పరిశీలన పనులు వారం రోజుల్లోపు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె అగరబత్తీల తయారీ రెండో యూనిట్ పనులు పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఉత్పత్తిని రెట్టింపు చేయడానికి అవసరమైన పూల సరఫరా, ఇతర ఏర్పాట్ల గురించి జేఈవో అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సదా భార్గవి మీడియాతో మాట్లాడారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటుతో గోశాలలోని గోవులు, ఎద్దులు, ఇతర జంతువులకు నాణ్యమైన దాణా తయారు చేసి అందించవచ్చునన్నారు. భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉండటంతో అగరబత్తీల ఉత్పత్తిని డబుల్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు జేఈవో వివరించారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, అగర బత్తీల రెండో యూనిట్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పద్మనాభ రెడ్డి, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ మనోహర్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# క్రీడాకారిణికి పాలకూర్ల ఫౌండేషన్ ఆర్థిక సహాయం




చౌటుప్పల్ ఫిబ్రవరి 7 ();;కేజీబీవీ చౌటుప్పల్ పాఠశాల యందు ఎనిమిదవ తరగతి చదువుతున్న రాష్ట్రస్థాయిలో వ్యాయామ క్రీడలు విభాగంలో 1600 మీటర్ల పరుగులతో విజయం సాధించి జాతీయస్థాయిలో సెలెక్ట్ అయింది. ఈ పోటీలో బీహార్ రాజధాని రాష్ట్రంలో ఈనెల 10, 13 తారీకు వరకు జరుగుతున్నాయి. అందులో పాల్గొనడానికి విద్యార్థికి ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల అట్టి విషయాన్ని తెలుసుకున్న శ్రీ పాల కూర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ మురళి మురళి తెలుసుకొని విద్యార్థికి రాను పోను మరియు భోజన ఖర్చుల కొరకు 3000 రూపాయలు హార్దిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ విద్యా మరియు ఆటల్లో రానున్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎస్ భవాని పి ఈ టి అనిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయాలి

### –పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి పువ్వాడ సవాల్

ఖమ్మం ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); దమ్ముంటే తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయాలి అని పువ్వాడ అజయ్ సవాల్ విసిరారు. ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పువ్వాడ పాల్గొని ప్రసంగించారు.బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్ ద్వారా గెలిచి పొంగులేటికి వంత పాడుతున్న నేతలంతా తక్షణమే రాజీనామా చేయాలి అని మంత్రి డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ క్రమశిక్షణా చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న వారంతా కేసీఆర్‌కు విధేయులే. నా బ్రాండ్ నా గ్రూప్ అంటే కుదరదు అని పువ్వాడ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్.. పొంగులేటి లాంటి వ్యక్తులను రాష్ట్రంలో ఎంతో మందిని చూశారు. పార్టీ శాసనసభా పక్షాన్ని 2009లో చీల్చే ప్రయత్నం చేసినప్పుడే కేసీఆర్ చలించలేదు అని గుర్తు చేశారు.కేసీఆర్ నీడ నుంచి వెళ్లిన వారికి రాజకీయ జీవితం లేకుండా పోయింది. కేసీఆర్ తయారు చేసిన నాయకులు చాలా పెద్దవాళ్లం అనుకుంటున్నారు. ఒక్కసారి కేసీఆర్ చేయి వదిలేస్తే వారి గతి అధోగతే అని హెచ్చరించారు. కొందరు పార్టీలు కూడా పెట్టారు. ఆ పార్టీలు పాన్‌డబ్బాలుగా మారిపోయాయని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీ, తెలంగాణలో కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ మాత్రమే జాతీయ పార్టీలను తట్టుకుని నిలబడ్డాయి. మిగతా పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు.బీ ఫామ్ ఇవ్వాలని తాను ఏ ఒక్క రోజు కూడా అడగలేదు. మీరంతా తన కుటుంబ సభ్యులే అని స్పష్టం చేశారు. వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ఏ ఒక్క రోజు కూడా తన స్వార్థం కోసం రాజకీయాలు చేయలేదు. తన నియోజకవర్గంలో కాకుండా ఇతర నియోజకవర్గాల్లో కుంపటి పెడుతావనడం సరికాదు. ప్రతి నాయకుడు పార్టీ విధానాల ప్రకారం నడుచుకోవాలి. వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించే బాధ్యత తానే తీసుకుంటున్నానని మంత్రి స్పష్టం చేశారు. వైరాలో బీఆర్ఎస్ ఎట్ల గెలవదో తాను చూస్తానని చెప్పారు. గ్రూపు రాజకీయాలు మంచివి కావు. కేసీఆర్ఎవరికీ అన్యాయం చేయకుండా అందరికీ పదవులు ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతి మన కళ్ల ముందు కనబడుతుంది. ఎవరో కేసీఆర్‌కు సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదు అని పువ్వాడ అజయ్ స్పష్టం చేశారు.

# జనవరి 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 135387 కోట్ల సరుకు రుసుమును ఆర్జించిన రైల్వేలు

### –గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే 16% పెరిగిన సరుకు రుసుం ఆర్జన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:భారతీయ రైల్వేలు ఆర్థిక సంవత్సరం 2022–23 తొలి పది నెలల్లో సరుకు రవాణా గత ఏడాది ఇదే కాలంలో జరిగిన లోడింగ్, ఆదాయాన్ని మిషన్ మోడ్‌లో అధిగమించింది.

ఏప్రిల్ – జనవరి 23 సంచిత ప్రాతిపదికన, గత సంవత్సరం రవాణా చేసిన 1159.08 మెట్రిక్ టన్నులతో పోలిస్తే 7% మెరుగుదలతో 1243.46 మెట్రిక్ టన్నులను సాధించింది. గత ఏడాది ఆర్జించిన రూ. 117212 కోట్లతో పోలిస్తే రైల్వేలు రూ. 135387 కోట్లను ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 16% మెరుగుదల.

జనవరి 23లో మూల సరుకు లోడింగ్ గత ఏడాది జనవరిలో సాధించిన 129.12 మెట్రిక్ టన్నుల కన్నా 4% అధికంగా 134.07 మెట్రిక్ టన్నులను సాధించింది. గత ఏడాది జనవరితో ఆర్జించిన 13172 కోట్ల సరుకు రుసుంకు వ్యతిరేకంగా ఈ ఏడాది సరుకు ఆదాయం రూ. 14907 కోట్లుగా ఉంది. ఇది గత ఏడాదికన్నా 13% మెరుగుదల.

హంగ్రీ ఫర్ కార్గో (సరుకు కోసం ఆకలి) అన్న మంత్రాన్ని అనుసరించి, భారతీయ రైల్వేలు సులభంగా వ్యాపారం చేయడాన్ని మెరుగుపరిచేందుకు, పోటీ ధరలలో సేవల బట్వాడాను మెరుగుపరిచేందుకు చేసినందుకు నిరంతర కృషి ఫలితంగా సంప్రదాయ, సంప్రదాయేతర సరుకు ప్రవాహంతో రైల్వేలకు నూతన రద్దీ రావడం మొదలైంది. వినియోగదారుడు కేంద్రంగా, ప్రత్యామ్నాయ ప్రణాళికతో చురుకైన విధానాలను రూపొందించడం అన్నది రైల్వేలు ఈ మైలురాయి విజయాన్ని సాధించడంలో తోడ్పడింది.

# గిరిజన ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ స్థితిగతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: గిరిజన ప్రాంతాలు, అటవీ, పర్వత ప్రాంతాల్లో మోటారు రహదారి ద్వారా చేరుకోలేని మారుమూల ప్రాంతాలు సహ దేశంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి 2024 నాటికి కుళాయి ద్వారా మంచి నీటి సరఫరాను అందించడానికి భారత ప్రభుత్వం రాష్ట్రాల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్ (జజెఎం) కింద హర్‌ఘర్ జల్‌ను అమలు చేస్తోంది. జల్ జీవన్ మిషన్‌ను 2019 ఆగస్టులో ప్రకటించే సమయానికి 3.23 కోట్ల (17%) గ్రామీణ కుటుంబాలకు మాత్రమే పంపు నీటి కనెక్షన్లు ఉన్నాయి. నేటివరకూ, అంటే 02.02.2023 నాటికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలూ అందించిన సమాచారం ప్రకారం గత మూడున్నర ఏళ్ళల్లో 7.83 కోట్ల కుటుంబాలకు పంపు నీటి కనెక్షన్లను అందించడం జరిగింది. దీనితో 02.02.2023 నాటికి దేశంలోని మొత్తం 19.36 గ్రామీణ కుటుంబాలలో దాదాపు 11.07 కోట్ల కుటుంబాలకు వారి గృహాలలో పంపునీటి సరఫరా చేస్తున్నారు. మిషన్ కింద డెజర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డిడిపి– ఎడారి అభివృద్ధి కార్యక్రమం), డ్రాట్ ప్రోన్ ఏరియా ప్రోగ్రాం (డిపిఏపి – కరువు పీడిత ప్రాంతాలకు కార్యక్రమం)లో గల క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాలకు 30% ప్రాముఖ్యతను, ఎస్సీ/ ఎస్టీ జనాభా ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలకు 10%నిధులు కేటాయిస్తున్న సమయంలో ప్రాముఖ్యతను ఇవ్వాలని నిర్ణయించారు. తద్వారా ఈ ప్రాంతాలను ప్రాధాన్యతలకు అనుగుణంగా కవర్ చేయాలన్నది లక్ష్యం. అదనంగా, మిషన్‌ను వేగవంతంగా అమలు చేసేందుకు జెజెఎం– ఎంఐఎస్‌లో , జెజెఎం డ్యాష్‌బోర్డులో (ప్యానెల్) అత్యున్నత స్థాయిలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేబినెట్ కార్యదర్శులు, కార్యదర్శి, ఆయా రాష్ట్రాలు/ కేంద్ర ప్రభుత్వాల ఇన్‌ఛార్జ్ కార్యదర్శులతో క్రమబద్ధంగా సమీక్షా సమావేశాలను, సదస్సులను, వర్క్‌షాపులను, వీడియో కాన్ఫరెన్సులను, క్షేత్ర పర్యటనల ద్వారా ఆయా రాష్ట్రాలతో ఫాలోఅప్ లు, సమర్ధవంతమైన పర్యవేక్షణల కోసం ఏర్పాటు చేసింది. గిరిజన కుటుంబాలకు అందించిన పంపునీటి కనెక్షన్ల వివరాలను కేంద్రం నిర్వహించడం లేదు. అయితే, రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ ప్రాంతాల వారీగా ఆయా రాష్ట్రాలలో, గిరిజన ప్రాంతాలలో గ్రామీణ కుటుంబాలకు 02.02.2023 నాటికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అందించిన పంపు నీటి కనెక్షన్ల సమాచారం జాబితాను జోడించిడమైంది.

# ప్రజలకు సురక్షిత తాగునీటి సౌకర్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:2024 నాటికి, దేశంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబానికి కొళాయి కనెక్షన్ ద్వారా రోజుకు తలసరి (ఐపీపీడీ) 55 లీటర్ల తాగునీటిని నిర్దేశిత నాణ్యతతో (బీఐఎస్:10500) నిరంతరం, దీర్ఘకాలం పాటు సరఫరా చేయడానికి రాష్ట్రాల భాగస్వామ్యంతో 2019 ఆగస్టు నుంచి జల్ జీవన్ మిషన్ (జేజేఎం) – హర్ ఘర్ జల్‌ను భారత ప్రభుత్వం అమలు చేస్తోంది.

2019 ఆగస్టులో జల్ జీవన్ మిషన్‌ను ప్రకటించే సమయానికి, 3.23 కోట్ల (17%) గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీటి కనెక్షన్‌లు ఉన్నట్లు నివేదిక ఉంది. ఇప్పటివరకు, రాష్ట్రాలు/యూటీల ద్వారా అందిన నివేదకల ప్రకారం, 02.02.23 నాటికి, ఈ మూడున్నరేళ్లలో 7.83 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు కొళాయి నీటి కనెక్షన్లు అందించడం జరిగింది.

ఇదే విధంగా, 02.02.2023 నాటికి దేశంలోని 19.36 కోట్ల గ్రామీణ కుటుంబాల్లో దాదాపు 11.07 కోట్ల (57%) కుటుంబాల ఇళ్లలో కొళాయి నీటి సరఫరా ఉన్నట్లు నివేదికలు ఉన్నాయి. నివేదికల ప్రకారం, దేశంలోని 6 లక్షల గ్రామాల్లో ఉన్న 16.95 లక్షల కుటుంబాలకు సహేతుకమైన దూరంలో సురక్షితమైన మంచినీటిని అందించడం జరిగింది. 11,877 గ్రామాల్లోని 24,543 ఆవాసాలకు సంబంధించి, అక్కడున్న తాగునీటి వనరుల్లో నాణ్యత లేమి సమస్యలు ఉన్నట్లు నివేదికల ద్వారా తెలుస్తోంది.

కొళాయి ద్వారా తాగునీరు పొందుతున్న గ్రామాల వివరాలు రాష్ట్రం/యూటీ, జిల్లాల వారీగా జేజేఎం డ్యాష్‌బోర్డ్‌లో పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి, ఈ క్రింది లింక్ ద్వారా ఆ వివరాలు తెలుసుకోవచ్చు:

కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఈరోజు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం రూపంలో ఈ సమాచారాన్ని తెలిపారు.

# కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం : సీపీఐ నేత శ్రీనివాస రావు




వరంగల్, ఫిబ్రవరి 7: కమ్యూనిస్టుల పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రం లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శాయంపేట మండలానికి చెందిన 50 మంది యువకులు సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి సీపీఐ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి సీపీఐ నాయకులు ఆహ్వానించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నది కమ్యూనిస్టు లేనని అన్నారు. ఇతర బూర్జువా పార్టీలకు ఓట్లు, సీట్లు మాత్రమే కావాలని, కానీ కమ్యూనిస్టులు సమసమాజ స్థాపనే లక్ష్యంగా పని చేస్తారని అన్నారు. పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా, నిరుద్యోగ, కార్మిక, కర్షక, మహిళల, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కోరారు. పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధించే వరకూ సిపిఐ భూపోరాటాలు నిర్వహిస్తూనే ఉంటుందని అన్నారు. సిపిఐ జెండా గ్రామ గ్రామాన ఎగురవేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, నాయకులు నేదునూరి రాజమౌళి,మారుపాక అనిల్ కుమార్, కొట్టెపాక రవి, కండె నర్సయ్య,బత్తిని సదానందం, అనుకారి అశోక్, మారపెల్లి క్రాంతి కుమార్, అరికిల్ల దేవయ్య, గుంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవయ్య,క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో శాయంపేట మండలానికి చెందిన జోగి రమేష్,పోలెపాక ప్రసాద్,జోగి కన్నయ్య, కె.శ్రీకాంత్, చల్లా సూర్య ప్రకాశ్, మోరె రవి, చింతల స్వామి, బాసాని భాస్కర్,రాజు,సారయ్య,వెంకన్న,అశోక్ తదితరులు సిపిఐ లో చేరారు.

# మార్చి 30న సీతారాముల కల్యాణం

ఖమ్మం ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భద్రాద్రి సీతారాముల కల్యాణ తేదీని వైదిక కమిటీ నిర్వాహకులు ఖరారు చేశారు. మార్చి 30న సీతారాముల కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. మార్చి 31న పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా జరిపేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణ తలంబ్రాలు కలిపే వేడుక, వసంతోత్సవం, డోలోత్సవాన్ని ప్రతి యేట మాదిరిగానే ఈ సారి కూడా ఘనంగా నిర్వహించనున్నారు. వేలాది సంఖ్యలో వచ్చే భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

# మొదటి విడత పరీక్ష ఫలితాలలో "అల్ఫోర్స్ హవా"




కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి): జనవరి - 2023 లో నిర్వహించబడిన ఐఐటీ - జేఈ ఈ ( మెయిన్ ) 2023 మొదటి విడత పరీక్ష ఫలితాలు ఈ రోజు విడుదల చేయబడ్డాయి. ఈ ఫలితాలలో మా అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో అద్భుత ప్రతిభతో జాతీయస్థాయిలో అత్యద్భుత పర్సంటైల్ సాధించారు.

ఏ. ఇషాంత్రెడ్డి 99.810 పర్సంటైల్తో అగ్రస్థానంలో నిలువగా అర్. సుహాషిత 99.66, యమ్.చిన్మయ్ 99.58, యమ్. అభిరామ్ 99.55, ఎస్. ప్రణతి 99.29. వి.వేణుగోపాల్ 99.23, పి.నిషాంత్ 99.07 , ఏ.సంపత్ 99.06, బి. రోషి 98.76. ఎస్. సాయిచరణ్ 98.75, కె.శశిప్రీతరెడ్డి 98.63, డి. వివేకవర్ధన్ 98.39, ఎస్. ఉజ్వల్ 98.24, అర్. చేతన 98.24, ఎల్.సాయితేజ 98.15, టి. అనుదీప్ 98.13, జి.సుసుమ్నాదేవి 97.86, ఏ. చందన శ్రీ 97.72, కె.లాహె?టి 97.67,అలియాన నస్రీన్ 97.45, వి.శ్రీహర్ష 97.43,ఏ. అక్షయ 97.41, ఇ.అన్విత్సాయి 97.25, సి.హెచ్. సుమిత్రాదేవి 97.17 పర్సంటైల్ను సాధించారు. అనేక మంది విద్యార్థులు 90 అ పై పర్సంటైల్ సాధించడం విశేషం. రెండవ విడత ఫలితాలలో కూడ మా అల్ఫోర్స్ విద్యార్థులు అఖండ విజయం సాధిస్తారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, పర్యవేక్షణ మరియు విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగింది. రాబోయే ఐఐటీ (అడ్వాన్స్ ), నీట్ మరియు ఇంఓఅఇ లో కూడ మా అల్ఫోర్స్ చిన్నారులు అద్భుత ర్యాంకులు సాధిస్తారని నేను విశ్వసిస్తున్నాను. ఎమి (ఓంఎఔ) ఫలితాలలో అద్భుత పర్సంటైల్ సాధించిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేయుచున్నాను. పై విషయమును మీ ప్రతిక ద్వారా ప్రజల దృష్టికి తీసుకువెళ్ళగలరు.

# గుమ్మడిదలలో మౌలిక వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే జీఎంఆర్



మెదక్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి):గుమ్మడిదల మండలంలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రూ.20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ సభ్య ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి జెడ్పిటిసి కుమార్ గౌడ్ లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మండల పరిధిలోని అన్నారం గ్రామంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గుమ్మడిదల మండల పరిధిలో రహదారుల నిర్మాణానికి కోటి 25 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితోపాటు ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

పల్లె ప్రగతి ద్వారా ప్రభుత్వం ఇప్పటికే ప్రతి గ్రామానికి ట్రాక్టర్ ట్రాలీ అందించడంతోపాటు, ప్రతినెల జనాభా ప్రాతిపదికన నిధులు అందిస్తోందని తెలిపారు. దీంతోపాటు అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు.

# దొంగతనం కేసును ఛేదించిన ప్రత్యేక పోలీస్ బృందం.

సంగారెడ్డి ఫిబ్రవరి 7 (నేటి నిజం ప్రతినిధి) గత నెల సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి గ్రామస్తురాలైన కుసంగి అనసూయ ఇంట్లో జరిగిన దొంగతనం కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మంగళవారము నాడు సంగారెడ్డి డిఎస్పీ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.

కుసంగి అనసూయ పిర్యాదు మేరకు ఆమె ఇంటిలో తేది 14-1-2023 నుండి 16-1-2023 మధ్య రాత్రులలో దొంగతనము జరిగింది అని కేసు నమోదు చేయగా సి.సి. కెమరాల ఆధారంగా నేరస్తుడు ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మెహబూబ్ అన్సారి( 38 సం ) గా పోలిసులు గుర్తించారు. సంగారెడ్డి డిఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి ఝార్ఖండ్ రాష్ట్రముకు కు పంపించి నేరస్తుడిని తేది 04-02-2023 నాడు పోలిసులు అధీనంలోకి తీసుకున్నారు. అతని దగ్గరనుండి బంగారు ఆభరణములు (1) సీతారామ హారం, (2) బంగారు గాజులు, (3) పుస్తెల త్రాడు - నల్లపూసలు, (4) చెవి కమ్ములు, మాటలు, (5) నెమలి పించం - చెవి కమ్ములు (6) గెంతులు, (7), రింగు (వంక), (8) చిన్న కమ్ములు 3 సెట్స్, (9) చింతగింజ పుస్త, (10) చైన్స్ (సిల్వర్) 2 సెట్స్, (11) గుండ్లు (63 విడిగా) మరియు (12) ముత్యాల హారం, మొత్తం 21 తులాల బంగారము ఆభరణములు మరియు (19) తులాల వెండి ఆభరణములు స్వాధీనము చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు సంగారెడ్డి డిఎస్పీ వెల్లడించారు. వాటి మొత్తం విలువ రూ. 12,00,000/ - వరకు ఉంటుంది అయన తెలిపారు. నిందితుడిని పట్టుకున్న పోలిసు టీమ్ సంగారెడ్డి రూరల్ సిఐను ఎస్ ఐ ,లను మరియు ప్రత్యేక బృందం అయిన జి. కృష్ణయ్య, ఎస్ ఐ పర్వేజ్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ మరియు ముక్తార్ అహ్మద్, కానిస్టేబుల్ లను అయన అభినందించినారు.

# అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా రమాబాయి జయంతి



మహబూబ్ నగర్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా రమాబాయి 125 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్. నరోజనమ్మ హాజరై ప్రసంగించారు.రమాబాయి ఫిబ్రవరి 7 తారీఖు 1898లో జన్మించింది మాత రమాబాయి ప్రపంచ మేధావిని తీర్చిదిద్ది దేశానికే దీపమయ్యారు. రమాబాయి బాబాసాహెబ్ ను గుర్తించిన అంతగా తన సొంత జాతి ప్రజలు విజయాలకు కారణమైన రమాబాయిను గుర్తించలేదని చెప్పాలి. తన త్యాగాల పునాదుల మీద బాబాసాహెబ్ యొక్క మేను పర్వతంగా తన నిలబెట్టింది డాక్టర్ అంబేద్కర్ గారి ఒక్కొక్క మెట్టు వెనుక రమాబాయి అమ్మ పంటి బిగువున గాయాలు ఉన్నాయి బాబాసాహెబ్ ఉన్నత చదువుల కోసం తాను ఎన్నో బాధలను అనుభవించింది. ఇల్లు గడవని స్థితిలో రమాబాయి పిడకలు చేసి అమ్మేవారు ఆ డబ్బులతో ఇల్లు గడిచేల చూడడమే కాకుండా అందులో కొంత డబ్బు డాక్టర్ అంబేద్కర్కి పంపించేవారు ఆమె జీవితకాల కష్టమే ఈ రోజున రాజ్యాంగం ద్వారా హక్కులు అన గారిన వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని అనడంలో సందేహం లేదు చివరికి 1935 మే 22న తుది శ్వాస విడిచారు. ఈ కార్యక్రమం లో రైకంతి రామదాస్, పాతూరి రమేష్, పరమేశ్వర్, అంజమ్మ, శ్రీ రాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో ఏడుగురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వెయిటింగ్లో అధికారులకు పోస్టింగ్ లు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐడీ ఎస్పీగా ఆర్ వెంకటేశ్వర్లు, సైబరాబాద్ పరిపాలన డీసీపీగా యోగేశ్ గౌతమ్, పీసీఎస్ ఎస్పీగా రంగారెడ్డి, జీఆర్పీ అడ్మిన్ డీసీపీగా రాఘవేందర్రెడ్డి, వరంగల్ పోలీస్ శిక్షణా కేంద్రం ఎస్పీగా పూజ, డీజీపీ కార్యాలయం న్యాయవిభాగం ఎస్పీగా సతీశ్, వరంగల్ నేర విభాగం డీసీపీగా మురలీధర్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గత జనవరిలోనూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఐపీఎస్లను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 25న రాష్ట్రవ్యాప్తంగా 91 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.

# మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు ఉండాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, ఫిబ్రవరి 07 (నేటి నిజం ప్రతినిధి) మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 18 నుండి అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు.

శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్ శరత్ స్థానిక శాసనసభ్యులు మాణిక్ రావుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

జాతరను అన్ని ఏర్పాట్లతో విజయవంతంగా నిర్వహించాలన్నారు.

జిల్లా నలుమూలల నుండే గాక ఇతర జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశముందన్నారు. ఏ ఏ ప్రాంతాల నుండి అధికంగా భక్తులు వస్తారో ఆయా ఏరియాలకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ వారికి సూచించారు. దేవాలయం చుట్టూ దేవాలయాన్ని పూలతో డెకరేషన్ చేయాలని,పరిసరాలు ప్లాంటేషన్ చేయాలని, దేవాలయాన్ని, ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకరించాలని ఆలయ ఈవోకు సూచించారు. రహదారుల పై జాతంకు సంబంధించి హోర్డింగ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధిక సంఖ్యలో టాయిలెట్స్, ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు స్నానమాచరించుటకు ఎక్కువ సంఖ్యలో షవర్లు, మంచినీటి సదుపాయాలు కల్పించాలన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ఎక్కువ మంది కార్మికులను ఏర్పాటు చేయాలని, గ్రామం, దేవస్థాన పరిసరాలు జాతర ఆవరణ మొత్తం ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ సభ్యంగా జరిగేలా చూడాలని డిపిఓ కు సూచించారు. బ్లీచింగ్ ,క్లోరినేషన్, ఫాగింగ్ వంటివి చేయాలన్నారు. విద్యుత్ లో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు, వైద్య ఆరోగ్యశాఖ జాతరలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 108 వాహనం అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. బందోబస్తు విషయంలో పోలీసులు గుడి లోపల , బయట గుడి ఆవరణలో పటిష్టమైన బందోబస్తు భద్రత ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు.

గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అధికారులందరూ సమిష్టి గా పని చేయాలని సూచించారు. జాతరలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, షవర్లు, ఆలయ ప్రవేశ ద్వారం తదితర వాటిని భక్తులు గుర్తించే విధంగా మ్యాప్ లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

దర్శనం క్యూ లైన్, ప్రసాదం, కొబ్బరి కాయల దగ్గర ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా చూడాలని, భక్తుల కాలక్షేపానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సి.సి. కెమెరాలు కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేసి పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆయా శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రోడ్స్, డ్రెయిన్లకు తాత్కాలిక మరమ్మత్తులు ఏవేని ఉంటే చేయించాలని, గుంతలను పూడ్చాలని అదేవిధంగా రోడ్డు ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ,ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. త్రాగునీటి సరఫరా విషయమై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎక్కడ ప్రజలు ఉంటే అక్కడ ట్యాంకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ టాయిలెట్స్ కాకుండా టెంపరరీ టాయిలెట్స్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా బస్టాండ్ లో కూడా డ్రింకింగ్ వాటర్ తాత్కాలిక టాయిలెట్స్ పెట్టాలని తెలిపారు. ఆయా పనులన్నింటినీ ఈనెల 16 లోగా ఆయా శాఖల అధికారులు పూర్తి చేసుకోవాలన్నారు.

ప్రతి షాప్ లో చెత్త డబ్బా ఉండాలని ఎట్టి పరిస్థితిలోనూ షాపుల వారు ఎక్కడపడితే అక్కడ చెత్త బయట వేయరాదన్నారు.

జాతరలో ఏర్పాటు చేసే ఫుడ్ షాప్ లలో నాణ్యత గల ఫుడ్ ఐటమ్స్ ఉండాలని ,వాటి ధరలను డిస్ ప్లే చేయాలని, ఆయా ఆహార పదార్థాల అమ్మకాలపై సరైన పర్యవేక్షణ ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారికి సూచించారు.

జాతర ఘనంగా నిర్వహించడానికి 10 లక్షల ప్రత్యేక ఫండ్ ను ఇవ్వాలని డిసిఎంఎస్ చైర్మన్ జిల్లా కలెక్టర్ ను కోరగా, కలెక్టర్ 10 లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు.

జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు మాట్లాడుతూ ఈనెల 18 నుండి 20 వరకు మూడు రోజులపాటు నిర్వహించు మహాశివరాత్రి జాతరకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పనిచేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణ బాగుండాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా శాఖల అధికారులు కోఆర్డినేషన్తో పని చేయాలన్నారు. అందరి సమన్వయంతో జాతర విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎం ఎస్ చైర్మన్ శివకుమార్,సి డి సి చైర్మన్ ఉమా కాంత్ పాటిల్, ఆలయ చైర్మన్ వెంకటేశం, ఈ .ఓ. , ఆర్డిఓ రమేష్ బాబు, జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్,ఎం.పి.పి,గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కప్



కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 12 న తేదిన స్థానిక బి.ఆర్ . అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి వారి ఆధ్వర్యంలో తెలంగాణా ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ సుడాచైర్మన్ కప్ సంబంధించిన బోచర్ ను మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వినోద్ కుమార్ కు ఒకినావా సంస్థల అధినేత చీఫ్ ఆర్గనైజర్ కె వసంత్ కుమార్ పూల బోకే అందజేసి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలోసుడా చైర్మన్ జి.వి. రామకృష్ణారావు, కరాటే శిక్షకులు పుల్లూరి శ్రీనివాస్ , బుర్ర ప్రవీణ్ కుమార్ , తిరుపతి , రాజశేఖర్ రెడ్డి , రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబాను 100 శాతం నిర్మూలించాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో గుడుంబాను 100 శాతం నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్లోని తన క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'నీరా కేఫ్' ప్రారంభోత్సవం పై చర్చించారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల పనితీరును మెరుగుపరచుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీరా కేఫ్కు అనుబంధంగా ఉన్న చిల్లింగ్ ప్లాంట్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సందర్భంగా అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో గుడుంబా నిర్మూలన 100 శాతం పూర్తిగా జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గుడుంబాతో ఏ ఒక్క గిరిజన మహిళ తన భర్తను కోల్పోకుండా గుడుంబా తయారీ అమ్మకం దారులపై ఉక్కు పాదం మోపాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కమిషనర్ అజయ్ రావు, డిప్యూటీ కమిషనర్లు డేవిడ్ రవికాంత్ , కేఏబీ శాస్త్రి, సహాయ కమిషనర్ చంద్రయ్య, ఈఎస్లు విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో క్షుద్రపూజల కలకలం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 7:తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలో క్షుద్రపూజల కలకలం చోటుచేసుకుంది. కోడేరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్ వద్ద గుర్తు తెలియని దుండగులు క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కల్పించాయి. పాఠశాల గేటు బయట ముగ్గులు వేసి పసుపు, కుంకుమ జల్లి పూజలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో స్కూల్ విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు.

# రైతులందరికీ అండగా ఉంటా-డాక్టర్ గోలి మోహన్

-గుండెపోటుతో మృతి చెందిన రైతు కుటుంబానికి పరామర్శించిన మోహన్ గోలి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7: (నేటి నిజం ప్రతినిధి): వేములవాడనియోజకవర్గంలోని కోనరావుపేట మండలం మల్కపెట్ గ్రామంలో బుట్టం రాజిరెడ్డి అనే రైతు ఇటీవల గుండెపోటుతో మరణించారు ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ గోలి మోహన్ సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు, అనంతరం గోలి మోహన్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు రాజిరెడ్డి గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలోని రైతులందరికీ అండగా ఉంటానని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్,వార్డు సభ్యులు మరియు యువకులు పాల్గొన్నారు.

# మెగా లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలి-పట్టణ ఇన్స్పెక్టర్ :వెంకటేష్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఈ నెల 11వ తేదీ శనివారం జరిగేమెగా లోక్ అదాలత్ ని సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ కక్షిదారులు రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, వివాహ,కుటుంబ తగాదాలు, చిట్ ఫండ్స్,రోడ్డు ప్రమాదాలు,ట్రాఫిక్ కేసులు,పెట్టీ కేసులు,ఇతర కేసులపై రాజీకి వస్తే కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చుని,ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా రాజీ మార్గం ద్వారా త్వరగా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.కేసులు కలిగిన ఇరువర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,నేర రహిత పట్టణంగా తీర్చి దిద్దుటకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.

# క్రీడలు ద్వారా మానసిక ఉల్లాసం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి): క్రీడల ద్వారా యువకులకు ఎన్నో లాభాలు కలుగుతాయని, మరియు పోటీ తత్వాన్ని రెట్టింపు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తుందని వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ- బాబు, జెడ్పిటిసి మ్యాకల రవి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజన్న ప్రీమియర్ లీగ్ లో భాగంగా కబడ్డీ మరియు వాలీబాల్ పోటీలకు ప్రారంభానికి కార్యక్రమానికి వారు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు చాలా మంది విద్యార్థులు మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్నారని తద్వారా విజయాలను సునాయాసంగా సాధించలేకపోతున్నారని విచారణ వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు బాధ్యతగా వారి పిల్లలకి ఇష్టమైన క్రీడా రంగంలో నైపుణ్యలచే శిక్షణ ఇప్పిస్తూ వారికి తగిన ప్రోత్సహి అందించాలని సూచించారు. ముందుగా పరిచయ వేదిక కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పిటిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆర్ సి రావు,ఎంపిటిసిల ఫోరమ్ అధ్యక్షులు వనపర్తి దేవరాజ్ , సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు ఊరడి రాంరెడ్డి ,ఎంపీటీసీలు గాలిపెల్లి సువర్ణ - స్వామి గౌడ్ , సర్పంచులు రంగు సత్తమ్మ - రాములు గౌడ్ , కొండపల్లి వెంకట రమణ రావు , అర్బన్ ఎంపిడిఓ శ్రీధర్ గౌడ్, బి ఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఉరి డి ప్రవీణ్, ప్రవీణ్ మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు,, పి టీలు, క్రీడాకారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# చిన్నారులలో మయోపియా పురోగతిని నెమ్మదింపజేసేలా లెన్స్‌లను విడుదల చేసిన ఎస్సిలార్



హైదరాబాద్, ఫిబ్రవరి 7:ప్రిస్క్రిప్షన్ లెన్స్‌లలో అంతర్జాతీయంగా అగ్రగామి ఎస్సిలార్ భారతదేశంలో ఎస్సిలార్ స్టెల్లెస్ట్ లెన్స్‌ను విడుదల చేసింది. చిన్నారులలో మయోపియా పురోగతిని నెమ్మదింప జేయడంతో పాటుగా వారి కంటి చూపును సైతం భవిష్యత్ కోసం కాపాడుతుంది.ఎస్సిలార్ స్టెల్లెస్ట్ లెన్స్‌లను (హైలీ అస్పెరికల్ లెన్స్‌లెట్ టార్గెట్) టెక్నాలజీగా పిలువబడే ప్రత్యేక సాంకేతికతతో తీర్చిదిద్దారు. ఎస్సిలార్ ఖీ ఆ బృందాలు దీనిని అభివృద్ధి చేశాయి. "ఎస్సిలార్ స్టెల్లెస్ట్ లెన్స్‌లు విడుదల చేయడంతో ఐ కేర్ ప్రొఫెషనల్స్‌కు దృష్టిని సరిచేయడం మరియు పిల్లల్లో మయోపియా పురోగతి అడ్డుకోవడంలో అందించే చికిత్సలో సరికొత్త విప్లవం లభించినట్లయింది. మయోపియా నిర్వహణలో దాదాపు 30 సంవత్సరాలకు పైగా ఖీ ఆ అనుభవంతో , అత్యుత్తమ పరిష్కారాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ లెన్స్, నిరూపిత ఆధారిత స్పెక్టకల్ లెన్స్ పరిష్కారం అందిస్తాయి. భారతీయ మార్కెట్‌లో గేమ్ ఛేంజర్‌గా ఎస్సిలార్ స్టెలెస్ట్ నిలువనుంది" అని నరసింహన్ నారాయణన్,కంట్రీ హెడ్, సౌత్ ఆసియా అన్నారు.ఎస్సిలార్ స్టెల్లెస్ట్ లెన్స్‌లను ప్రోగ్రెసివ్ మయోపియా తో బాధపడుతున్న చిన్నారులకు మయోపియా రిస్క్ కారకాలను పరిశీలించడంతో పాటుగా తగిన పరీక్షలను నిర్వహించిన తరువాత, చిన్నారికి ఈ లెన్స్‌ల వల్ల ప్రయోజనం ఉందా లేదా అన్నది నిర్ధారించిన తరువాత సూచిస్తారు. మరిన్ని వివరాల కోసం ష్టబిబిజూబ://లిలిలి.వబబతిశ్రీనీతీతినిటతిజీ.ఇనీఎ/ చూడవచ్చు.ఈ ఉత్పత్తి ఎస్సిలార్ ఎక్స్‌పర్ట్ స్టోర్స్‌తో పాటుగా భారతదేశంలో సుప్రసిద్ధ నేత్ర వైద్య శాలల్లో లభ్యమవుతుంది. ఈ ఎస్సిలార్ స్టెల్లెస్ట్ వినియోగదారులకు 16500 రూపాయలలో లభిస్తుంది. (పన్నులు అదనం

# ఉత్తమ మిమిక్రీ రత్న అవార్డు అందుకున్న మిమిక్రీ రమేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 7:హైదరాబాదులో జరిగిన తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ప్రసాద్ లాబ్స్ హైదరాబాద్ లో తెలుగు సినిమా లెజెండ్ మెమోరియల్ అవార్డ్స్ ను ప్రధానం చేశారు. పలువురు సినీ నటులు, దర్శకులు, నిర్మాతలు, టెక్నీషియన్స్ కు ఈ అవార్డులను ప్రధానం చేశారు. దీనిలో భాగంగా హైదరాబాద్ కు చెందిన ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ కు ఉత్తమ మిమిక్రీ రత్న పురస్కారం అందజేశారు. ప్రముఖ సినీనటులు మురళీమోహన్, శివకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు మిమిక్రీ రమేష్.. ఈ కార్యక్రమంలో పలువురు సినిమా నటులు దర్శకులతో పాటు క్రాస్ రోడ్స్ అధినేత పలాటి వినోద్, టెక్నీషియన్స్ కార్యక్రమ నిర్వాహకులు జీవి మోహన్ గౌడ్, విజయవర్మ పాకాలపాటి, కూనిరెడ్డి శ్రీనివాస్ ఆర్ వి ఎన్ వరప్రసాద్, టీవీ నటుడు లోహిత్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న భక్తులకు శుభవార్త.. శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7:శివరాత్రి సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి హైదరాబాద్ నుంచి 390 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ఈ బస్సు సర్వీసులు ఈ నెల 16 నుంచి ప్రారంభమై 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, కెపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈ సర్వీసులు నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ నెల 16న 36 ప్రత్యేక బస్సులు, 17న 99బస్సులు, 18న 99బస్సులు, 19న 88 బస్సులు నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. మిగతా 68 బస్సులు ఇతర ప్రాంతాల నుంచి నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎంజీబీఎస్ నుంచి శ్రీశైలంకు సూపర్ లగ్జరీలో వెళ్లేందుకు ఒకరికి రూ.600.. డీలక్స్ కు రూ.540, ఎక్స్‌ప్రెస్ కు రూ.460లు టికెట్ చార్జీలుండగా.. హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాల నుంచి సూపర్ లగ్జరీలో వెళ్లేవారికి ఒక్కొక్కరికి రూ.650లు, డీలక్స్‌లో రూ.580, ఎక్స్ ప్రెస్‌లో రూ.500 చొప్పున చార్జీలు వసూలు చేయనున్నట్టు వెల్లడించారు.

సలహాలు, సూచనలకు.. ఎంజీబీ ఎస్ లో 9959226250, 9959226248, 9959226257 ఫోన్ నెంబర్లకు, జేబీఎస్ లో 9959226246, 040-27802203, ఐ.ఎస్.సదన్ లో 9959226250, బీ. హెచ్. ఈఎల్, కే.పీ.హెచ్.బీ ప్రాంతాల్లో 9959226149 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చు.

# 2వేల మంది ఉద్యోగులను తొలగించనున్న బోయింగ్

న్యూయార్క్ :, ఫిబ్రవరి 7:కార్పొరేట్ దిగ్గజాల కొలువుల కోతకు తెరపడటం లేదు. ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడుతుండటంతో టెక్ కంపెనీలతో పాటు పలు కంపెనీలు మాస్ లేఆఫ్స్‌కు తెగబడుతున్నాయి. ఈ ఏడాది 2 వేల వైట్ కాలర్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు బోయింగ్ కసరత్తు సాగిస్తోంది.

అట్రిషన్, లేఆఫ్స్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమైనట్టు అమెరికన్ ప్లేన్‌మేకర్ వెల్లడించింది. 2022లో 15,000 మందిని నియమించుకోగా 2023లో 15,000 మందిని హైర్ చేస్తామని గత నెలలో ప్రకటించిన బోయింగ్ తాజాగా ఆ ప్రయత్నాలను విరమించుకుంది. ఫైనాన్స్, హెచ్‌ఆర్ విభాగాల్లో ఈ ఏడాది 2000 మంది ఉద్యోగులను తొలగించాలని కసరత్తు సాగుతోందని కంపెనీ వెల్లడించిందని సీటెల్ టైమ్స్ రిపోర్ట్ తెలిపింది.

మూడో వంతు ఉద్యోగులను భారత్‌లో టాటా కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవుట్‌సోర్సింగ్ చేస్తామని కంపెనీ పేర్కొంది. తమ కార్పొరేట్ స్వరూపాన్ని సరళీకరిస్తామని బోయింగ్ స్పష్టం చేసింది. తయారీ, ఉత్పత్తి అభివృద్ధిపై అధిక నిధులు వెచ్చించేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని బోయింగ్ పేర్కొంది.

# విస్తరణ పథంలో బాల్కో, ఒన్ మిలియన్ టన్స్ క్లబ్‌లో చేరేందుకు ప్రణాళికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7:దేశంలో అగ్రగామి అల్యూమినియం తయారీ కంపెనీలలో ఒకటైన భారత్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (బాల్కో) 1965 నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఛత్తీస్ ఘడ్‌లోని కోర్బా వద్ద కార్యకలాపాలు ప్రారంభించిన ఈ కంపెనీ అల్యూమినియం తయారీ కాంప్లెక్స్‌ను సంవత్సరానికి ఒక లక్ష టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేసింది. ఈ కంపెనీని 2001లో వేదాంత సొంతం చేసుకుంది. ప్రస్తుతం బాల్కోలో వేదాంతకు 51% వాటా ఉండగా, ప్రభుత్వానికి 49% వాటా ఉంది.ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న ఒకే ఒక్క అల్యూమినియం కంపెనీగా రాష్ట్ర అభివృద్ధికి బాల్కో ఎంతో తోడ్పడుతుంది. 2004 సంవత్సరం వరకూ ఒక లక్ష టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన బాల్కో, అప్పటి నుంచి ఉత్పత్తి 155% వృద్ధి చేసి ప్రస్తుతం సంవత్సరానికి 5.70 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచంలో అగ్రగామి వైర్ రాడ్ తయారీ సంస్థలలో ఒకటి బాల్కో. అల్లాయ్ రాడ్స్, ఎఫ్‌సీ రాడ్స్ మరియు ఫ్లిప్‌కాయిల్స్‌తో పాటుగా ప్రైమరీ అల్యూమినియం ఇగ్నోట్స్ సైతం బాల్కో తయారుచేస్తుంది. భారతదేశంలో అల్యూమినియం ఉత్పత్తిని గణనీయంగా వృద్ధి చేయడానికి బాల్కో కృషి చేస్తుంది, ప్రపంచంలో సరాసరిన ఒక వ్యక్తి 11.7 కేజీల అల్యూమినియం వినియోగిస్తుంటే భారతదేశంలో అది కేవలం 2.5 కేజీలు మాత్రమే ఉంది.ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి పరంగా రెండవ స్థానంలో ఉన్న బాల్కో భవిష్యత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా వృద్ధి చేయాలని కోరుకుంటుంది. బాల్కో త్వరలోనే ఒక మిలియన్ టన్నుల క్లబ్‌లోకి చేరడానికి ప్రణాళిక చేసింది. ఈ ప్రతిపాదిత ఉత్పత్తితో ఒకే ప్రాంతం నుంచి అత్యధిక ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలో ఏడవ సంస్థగా నిలువనుంది. ఈ విస్తరణతో ఛత్తీస్‌ఘడ్‌కు 600 కోట్ల రూపాయల మేర ఆదాయం సృష్టించడంతో పాటుగా 2వేల మందికి ఉపాధి అవకాశాలను సైతం అందించనుంది. తమ భావి ప్రాజెక్టుల ద్వారా దాదాపు 30వేల మంది జీవితాలను స్పృశించనుంది. తమ అదనపు సామర్థ్యపు అవసరాలు అందుకోవడానికి అల్యూమినియం పార్క్ సైతం ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది.బాల్కో ఇప్పుడు ముడిపదార్థాల లభ్యత, పన్నులు, సెస్‌లు, డ్యూటీల పెరుగుతుండటం, అత్యధిక కార్బన్ ట్యాక్స్, అల్యూమినియం, స్క్రాప్ దిగుబడులు పెరగడం , దేశీయ మార్కెట్ తగ్గడం వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది.

# వేములవాడను యాదగిరిగుట్ట అభివృద్ధి చేస్తాం- మంత్రి తారక రామారావు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రసిద్ధి శైవ క్షేత్రం వేములవాడ ను రానున్న రోజుల్లో యాదాద్రి తరహాలో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు.వేములవాడలో జరగనున్న మహా శివరాత్రి వేడుకల పైన మంత్రి కే. తారకరామారావు స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబుతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని చేసే ఏర్పాట్లతో పాటు వేములవాడ క్షేత్రం అభివృద్ధి పైన మంత్రి కేటీఆర్ అధికారులతో సమీక్షించారు. ఈ శివరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం తో పాటు, దేశంలోని అనేక ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని తెలిపిన కేటీఆర్, ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణం మొత్తంలో పారిశుద్ధ్య నిర్వహణ పైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా అదనపు అంబులెన్సు, ఫైర్ అంబులెన్సు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేములవాడ జాతరకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు అదనపు నిధుల కేటాయిస్తామని తెలిపారు. ప్రతి ఏడాది శివరాత్రి వేడుకల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్న మంత్రి కేటీఆర్, ఇందుకోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సందర్భంగా వేములవాడలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల పైన అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు

వేములవాడ గుడి చెరువు బండ్ ను వరంగల్ తరహాలో నిర్మించనున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలకు మారుపేరుగా నిల్వనున్నాయన్న కేటీఆర్ ఆ దిశగా వాటిని అభివృద్ధి చేసే ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆదేశించారు. సిరిసిల్ల శివారులోని రామప్ప గుట్టపై అతి ఎత్తైన శివుని విగ్రహం, కాటేజీల నిర్మాణం,అడ్వెంచర్ గేమ్స్ అలాగే వేములవాడ శివారులోని నాంపల్లి గుట్టపై కేబుల్ కార్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయంకు వచ్చే పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులలో ఫుట్ పాత్ లను నిర్మించాలని ఆదేశించారు. అవకాశం ఉన్న ప్రతి చోట వాల్ పెయింటింగ్ ఆర్ట్ ను ఉపయోగించుకొని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మూల వాగుకు అనుకుని ఉన్న బండ్ ను సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ గా మారుస్తామన్నారు. చెక్ డ్యాం ల నిర్మాణం వల్ల నీటి నిర్వహణతో పాటు, వాటి పరిసర ప్రాంతాలను అందమైన ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజన్న ఆలయానికి అనుసంధానంగా ఉన్న సంస్కృత పాఠశాలకు అనుబంధంగా నృత్య పాఠశాల, సంగీత పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు వాటికి ప్రత్యేకంగా భవన నిర్మాణాలు చేపడతామన్నారు. అత్యున్నత ప్రమాణాలతో వేములవాడ యువత కోసం మినీ స్టేడియం నిర్మాణం తొందరలోనే పూర్తి చేస్తామన్నారు. కొదురుపాక నుంచి వేములవాడ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం, నాంపల్లి గుట్టపై రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వేములవాడ స్థానిక ఎమ్మెల్యే బాబు తో పాటు, ఆర్ అండ్ బి, శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ ఆలయ అధికారులు, వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు

# క్షేత్రస్థాయిలో ఎంఐఎం బలోపేతమే లక్ష్యంగా డివిజన్ సందర్శన కార్యక్రమం

-మున్సిపల్ కార్పోరేషన్ పై ఎంఐఎం జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలి

-రాబోయే అసెంబ్లీ..పార్లమెంట్ ఎన్నికల్లో హైకమాండ్ ఆదేశాల మేరకు మద్దతు..

-ఈనెల 13న ఇస్లాంపూర.. గోష్ కట్టలో మొదటి బహిరంగ సభ

-35 డివిజన్ల అధ్యక్షుల.. సమీక్ష సమావేశంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడి




కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి):నగరంలోని 35 డివిజన్లలో క్షేత్రస్థాయిలో ఎంఐఎం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా డివిజన్ సందర్శన.. హాలాతే.. హాజిరా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడించారు. మంగళవారం.. ఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు నగర పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన, నగర ఎంఐఎం కమిటి పర్యవేక్షణలో.. పార్టీ కార్యాలయం దారుస్సలాంలో 35 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ డివిజన్ సందర్శన కార్యక్రమం, బహిరంగ సభలకు సంబంధించిన అంశాలను, అనుసరించాల్సినటువంటి వ్యూహాలు, చేయాల్సినటువంటి కసరత్తుపై డివిజన్లలో.. అధ్యక్షులకు.. బాధ్యులకు పలు సూచనలు చేసి.. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నగరవ్యాప్తంగా ఆయా డివిజన్లలో ఎంఐఎం పార్టీ సహాయ సహకారాలతో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని కోరారు. డివిజన్లలో పార్టీ విస్తరణ పురోగతి ప్రజల్లోకి ఎంఐఎం ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై కృషి చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్లలో నిర్వహించబోయే బహిరంగ సభల్లో డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు ప్రజా ప్రతినిధులైన కార్పొరేటర్ల సమన్వయంతో కలిసికట్టుగా, పదునైన వ్యూహాలతో కార్యక్రమాలను విజయవంతం చేయడానికి శ్రమించాలని ఆదేశించారు. ప్రతినెల చివరి ఆదివారం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతో పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం ఉంటుందని, ప్రతి నెల చివరి ఆదివారం ఖచ్చితంగా ఎంఐఎం పార్టీ ఆయా డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై తమ అభిప్రాయాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. 2018 నుండి పార్టీని బలోపేతం చేసేందుకు శ్రమిస్తే, 2020 మున్సిపల్ ఎన్నికల్లో 7గురు కార్పొరేటర్లను గెలిపించుకున్నామని, రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యం గా ఇప్పటి నుండి మరోసారి గట్టిగా ఓ పట్టుపట్టి కష్టపడితే 20 స్థానాల్లో పోటీ చేస్తే ఖచ్చితంగా 15స్థానాల్లో విజయం సాధిస్తామని, మేయర్, డిప్యూటీ మేయర్ సైతం ఎంఐఎం పార్టీ ఖాతాలోకి చేరుతాయని.. తద్వారా మున్సిపల్ కార్పోరేషన్ పై ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. డివిజన్ల అధ్యక్షులతో.. కార్పొరేటర్లతో కలిసి శ్రమిస్తే రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ హైకమాండ్ ఆదేశానుసారం ఏ పార్టీకి మద్దతునివ్వాలని సూచిస్తే ఆపార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా ఆ అభ్యర్థికి తమది పూర్తిస్థాయిలో మద్దతు ఉంటుందని చెప్పారు.

నగరంలోని 45వ డివిజన్ ఇస్లాంపుర అశోక్ నగర్ ప్రాంతంలోని గోష్ కట్టలో ఈనెల 13న సోమవారం సాయంత్రం 6:30 కు తొలి సభను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సభకు సంబంధించినటువంటి అనుమతి తీసుకోవాలని ఆయా డివిజన్ అధ్యక్ష కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రటరీలు హఫీజ్ సయ్యద్ మోయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, సయ్యద్ ఖమరుద్దీన్, కోశాధికారి సయ్యద్ ఇబ్రహీం బియబాని, డివిజన్ల అధ్యక్షులు కాజం అలీఖాన్, అఫ్జల్, అన్నేమల్ల సురేష్, సాజిద్ మాజీద్, సుధాకర్, శంకర్ బాబు, బాలరాజ్, షేక్ యాఖూబ్, ఇస్మాయిల్, బాస్, నోమాన్, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ ఎక్సలెన్స్ లక్ష్యంగా, మహీంద్రా ఎం బి ఎ ప్రోగ్రామ్ ప్రారంభం

Mahindra™ University
Global Thinkers. Engaged Leaders.

హైదరాబాద్, ఫిబ్రవరి 7:ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ ఎక్సలెన్స్ సాధించే లక్ష్యంతో, మహీంద్రా విశ్వవిద్యాలయం, అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణ వ్యవస్థాపకత ద్వారా కొత్త జ్ఞానాన్ని ఉత్పత్తి చేయడంపై దృష్టి సారించిన మల్టీ-డిసిప్లినరీ విశ్వవిద్యాలయం తన రెండేళ్ల ప్రారంభాన్ని ప్రకటించింది. పూర్తి సమయం ఎం బి ఎ ప్రోగ్రామ్ ప్రారంభించారు. ఎం బి ఎ ప్రోగ్రామ్ యొక్క పాఠ్యాంశాలు మూడు స్పెషలైజేషన్లను అందిస్తాయి - బిజినెస్ అనలిటిక్స్, డిజిటల్ బిజినెస్ ఫైనాన్స్. ఇది అధిక-క్యా లిబర్ విద్యార్థులను చేర్చుకోవడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు ఎంపిక బలమైన విద్యా పనితీరు, జి మ్యాట్ జి అర్ ఈ వంటి ప్రామాణిక ప్రవేశ పరీక్షలలో మంచి స్కోర్‌లు పాఠ్యేతర విజయాల మిశ్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ ప్రమాణాలన్నీ వ్రాతపూర్వక దరఖాస్తు ఇంటర్వ్యూ ద్వారా మూల్యాంకనం చేయబడతా యి.ప్రోగ్రామ్ దాని విద్యార్థుల ప్రొఫైల్‌కు అనుగుణంగా అద్భుతమైన వంశపారం పర్యతతో అధ్యాపకులచే బోధించబడుతుంది. ప్రోగ్రామ్‌లో విద్యార్థులను అంతర్జాతీయ దృక్పథంతో, నిర్వాహక సాంస్కృతిక రెండింటినీ సన్నద్ధం చేయడానికి అంతర్జాతీయ ఇమ్మర్షన్ ఉంటుంది. ఇమ్మర్షన్‌లో వ్యాపారాల సందర్శనలు, అతిథి వక్తల ప్రదర్శనలు, స్థానిక సంస్కృతికి పరిచయం మొదలైనవి ఉంటాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తూ మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేదూరి మాట్లాడుతూ "కంపెనీలు మరింత సౌలభ్యాన్ని అందిస్తున్నందున, ఉన్నత విద్య కార్పొరేట్ భారతదేశం మధ్య అంతరం పెరుగుతోంది. విద్యార్థులు కేవలం డిగ్రీతో గ్రాడ్యుయేట్ కాకుండా, సహేతుకమైన జీవన ప్రమాణాన్ని సురక్షితమైన స్థిరమైన ఉపాధికి మార్గంతో ఉండేలా కళాశాలలు ఒత్తిడిలో ఉన్నాయని అన్నారు. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్డీ న్ డాక్టర్ రామకృష్ణ వేలమూరి మాట్లాడుతూ "మా ఎం బి ఎ ప్రోగ్రామ్ ప్రారంభమైందని ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాము. ఎం బి ఎ ప్రోగ్రామ్ జాతీయ అంతర్జాతీయ వ్యాపార పర్యావరణ వ్యవస్థలలోని మార్పులను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి చేయబడింది, ఇవి పెరుగుతున్న డిజిటలైజ్డ్ ప్రపంచంలో ఎక్కడైనా పనిచేయడానికి వీలు కల్పించే నైపుణ్యాలతో బలమైన వ్యాపార పునాదిని మిళితం చేయడంలో విద్యార్థుల ఆసక్తిని రేకెత్తించాయి అని తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail:netinijam93@gmail.com.